# క్రైమ్ ది మిర్రర్®

Voice of Anti Corruption

హైదరాబాద్
25-5-2026
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:16
సంచిక: 64

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD


## ఏపీలో 15 లక్షల కొత్త పింఛన్లు!

కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం

రాష్ట్ర ప్రభుత్వం పై అదనపు భారం



2లో

## ఎండ ప్రచండం!

తెలంగాణలో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు

ఉడికించేస్తున్న వడగాలులు

మరో మూడు రోజులపాటు ఇలానే అంటున్న వాతావరణ శాఖ



**క్రైమ్ మిర్రర్, హైదరాబాద్:** తెలంగాణ ఉడికిపోతుంది. ఎండ ప్రచండంగా మారుతోంది. భానుడి దెబ్బకు రాష్ట్రం వణికిపోతోంది. వడదెబ్బకు ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు.

2లో



## డీకే అరుణకు బిజెపి పగ్గాలు!

దూకుడు కలిగిన మహిళా నేతగా గుర్తింపు

తెలంగాణ సీఎం రేవంత్ కు కళ్లెం వేయాలని బిజెపి పెద్దల ఆలోచన

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** తెలంగాణ బిజెపి విషయంలో హైకమాండ్ కఠిన నిర్ణయాలు దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. వచ్చే ఎన్నికల్లో ఎలాగైనా తెలంగాణలో పాగా వేయాలని భావిస్తోంది. అందుకు ఏ చిన్న అవకాశాన్ని కూడా జారవిడుచుకోకూడదని భావిస్తోంది. మంత్రివర్గ విస్తరణలో భాగంగా ఈసారి తెలంగాణకు ప్రాధాన్యం ఇవ్వాలని చూస్తోంది. మరోవైపు బిజెపి పగ్గాలు వేరే నేతకు ఇవ్వాలని కూడా ఆలోచన చేస్తున్నట్లు సమాచారం. ప్రస్తుత రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర రావు అనుకున్న స్థాయిలో పని చేయడం లేదన్న

## గోదావరి పుష్కరాలకు రూ.1000 కోట్లు!



తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం


తక్షణ ఏర్పాట్లకు రూ.300 కోట్లు

పర్యవేక్షణకు మంత్రులతో నాలుగు కమిటీలు

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** గోదావరి పుష్కరాలు అంటే ముందుగా గుర్తొచ్చేది ఏపీ.. రాజమండ్రి తో పాటు ఉభయ గోదావరి జిల్లాలో మాత్రమే గోదావరి పుష్కరాలు జరుగుతాయని అంతా భావిస్తారు. కానీ తెలంగాణలో సైతం గోదావరి పుష్కరాలు నిర్వహించేందుకు అక్కడి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటుచేస్తోంది. గోదావరి ఒక్క ఏపీలోనే కాదు తెలంగాణలో సైతం ప్రవహిస్తూ వస్తుంది. అందుకే తెలంగాణలో సైతం గోదావరి పుష్కరాలను ఘనంగా జరిపేందుకు

2లో

## ఇక ఎన్డీఏదే రాజ్యసభ!



కేంద్రంలో భారతీయ జనతా పార్టీకి సంపూర్ణ విజయం దక్కనుంది. పార్లమెంట్ ఉభయ సభల్లో ఆ పార్టీకి పూర్తి ఆధిపత్యం రానుంది. రాజ్యసభలో బిజెపి బలం అమాంతం పెరగనుంది. ఎన్డీఏ స్పష్టమైన మెజారిటీ దక్కించుకోనుంది. రాజ్యసభకు సంబంధించి పది రాష్ట్రాల నుంచి 24 సభ్యుల పదవీ విరమణ జూన్ 21న జరగనుంది. అందుకే ఎన్నికల కమిషన్ ఎన్నికలు నిర్వహించేందుకు షెడ్యూల్ విడుదల చేసింది. జూన్ 18న పోలింగ్ జరగనుంది. దీంతో ఎన్డీఏ, బిజెపి బలం సభలో పెరగనుంది. కాంగ్రెస్ పార్టీకి బలం తగ్గనుంది.

పెద్దల సభలో అతిపెద్ద పార్టీగా బిజెపి

ఎన్డీఏ పరంగా స్పష్టమైన మెజారిటీ

సభలో మూడింట రెండో వంతు..

బిల్లులకు ఇక అడ్డు ఉండదు

**క్రైమ్ మిర్రర్, సెంట్రల్ డెస్క్:**

సగానికి పైగా ఎన్డీఏకు.. ఏపీతోపాటు పది రాష్ట్రాలకు చెందిన 24 మంది రాజ్యసభ సభ్యులు పదవీ విరమణ చేయనున్నారు. అయితే ఇలా రిటైర్డ్ అవుతున్న సభ్యుల్లో 12 మంది బీజేపీకి చెందినవారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, దిగ్విజయ్ సింగ్ లాంటి నేతలు కూడా పదవీ విరమణ చేయనున్నారు. అయితే బిజెపి తాను కోల్పోయే స్థానాల కంటే ఎక్కువ స్థానాలు గెలిచే అవకాశం ఉంది.

## మంద కృష్ణ మాదిగ కే ఛాన్స్!


ఏపీ నుంచి రాజ్యసభ సభ్యుడిగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు

కేంద్ర పెద్దల గ్రీన్ సిగ్నల్

5లో



**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:**
ఏపీలో రాజ్యసభ ఎన్నికల సందడి మొదలైంది. నలుగురు సభ్యులు పదవీ విరమణ చేస్తున్నడంతో.. వారి స్థానంలో కొత్త వారి ఎంపిక కోసం ఎన్నిక అనివార్యంగా మారింది. అయితే ఈసారి బిజెపికి రాజ్యసభ ఛాన్స్ లేదని ప్రచారం నడిచింది.



## హైదరాబాద్ నడిబొడ్డున ఎన్టీఆర్ విగ్రహం!

తెలంగాణలో ఈనెల 28న ఒక సరికొత్త ఆవిష్కరణ జరగనుంది. టిడిపి వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు విగ్రహాన్ని.. కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవిష్కరించనున్నారు. కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా తెలుగుదేశం పార్టీని స్థాపించారు ఎన్టీఆర్. అటువంటి నేత విగ్రహాన్ని హైదరాబాద్ నడిబొడ్డున ఏర్పాటు చేయడం..

ఆవిష్కరించనున్న తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి

ఇచ్చిన మాట నిలబెట్టుకున్న కాంగ్రెస్ సర్కార్

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** ప్రభుత్వమే ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం.. కాంగ్రెస్ పార్టీ సీఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరించడం వెనుక పక్కా రాజకీయ వ్యూహం ఉంది. తెలుగు వారి ఆత్మ గౌరవ ప్రతీకగా నందమూరి తారక రామారావును అభివర్ణిస్తారు. విశ్వవిఖ్యాత నటసార్వభౌముడిగా గుర్తింపు

2లో

## వైసీపీలో సర్వేల కలకలం!

వచ్చే ఎన్నికల్లో బలమైన నేతలను బరిలో దించేందుకు వ్యూహం

ఆందోళనలో నియోజకవర్గ ఇన్చార్జిలు

ముంచుకొస్తున్న స్థానిక సంస్థల ఎన్నికలు

**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో సర్వేలు కలకలం రేపుతున్నాయి. నియోజకవర్గాల్లో పార్టీ హై కమాండ్ సర్వేలు చేస్తోంది. ఇప్పుడు కొనసాగుతున్న ఇన్చార్జిల స్థానంలో చాలా వరకు కొత్తవారు వస్తారన్న టాక్ ప్రారంభం అయింది. అలా అయితే పార్టీ కోసం ఎందుకు కష్టపడాలనుకుంటున్నారు కొందరు ఇన్చార్జిలు.





## రాజ్యసభ రేసులో నాగబాబు!

ఎమ్మెల్సీ పదవి వదులుకునేందుకు సిద్ధం

ఎంపీ అయితే కేంద్ర మంత్రివర్గంలో చోటు

మారిన మెగా బ్రదర్ ఆలోచన

**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** జనసేనకు ఈసారి రాజ్యసభలో ప్రాతినిధ్యం పక్కా అని తేలిపోయింది. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత రెండు సార్లు రాజ్యసభ ఎన్నికలు జరిగాయి. కానీ జనసేన కు ఛాన్స్ దక్కలేదు. ఈసారి మాత్రం పక్కా అని తెలుస్తోంది. టిడిపి 2, బిజెపికి ఒకటి, జనసేనకు ఒక రాజ్యసభ పదవి అని పంపకాలు పూర్తయినట్లు సమాచారం. అయితే బిజెపి విషయంలో




# గోదావరి పుష్కరాలకు రూ.1000 కోట్లు!

(మొదటి పేజీ తరువాయి)

అక్కడి ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకుగాను రూ.1000 కోట్లను కేటాయిస్తూ మంత్రివర్గ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రకటన చేశారు. దీనికి మంత్రులు ఆమోదం తెలిపారు. తక్షణం ఏర్పాట్లు ప్రారంభించాలని కూడా సీఎం స్పష్టం చేశారు. రూ.300 కోట్లు విడుదల చేయాలని కూడా నిర్ణయించారు.

**వచ్చే ఏడాది జూన్ లో..**

వచ్చే ఏడాది జూన్ లో గోదావరి పుష్కరాలు జరగనున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వంలో తొలి పుష్కరాలు ఇవే. అందుకే తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అనుగుణంగా అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. పుష్కరాల ఏర్పాట్లను పరిశీలించేందుకు, నిర్వహణను సమన్వయం చేసుకునేందుకు మంత్రులతో కూడిన నాలుగు కమిటీలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దీనిపై కసరత్తు చేసే బాధ్యతను మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు అప్పగించారు. పుష్కరాలకు ప్రత్యేక బస్సులు పెట్టడంతో పాటు భక్తులకు నది తీరం వెంబడి సౌకర్యాలను ఏర్పాటు చేయడం వంటివి కీలకంగా ఉండాలని సీఎం రేవంత్ ఆదేశించారు.



**మూడు రాష్ట్రాల్లో పుష్కరాలు..**

గోదావరి పుష్కరాలు అనేవి కేవలం ఏపీలో మాత్రమే కాదు. తెలంగాణతో పాటు మహారాష్ట్రలో నిర్వహిస్తున్నారు. మూడు రాష్ట్రాలు పోటా పోటీగా ఏర్పాట్లు చేస్తున్నాయి. గోదావరి పుష్కరాలను ఏపీ ప్రభుత్వం ఇప్పటికే ప్రతిష్టాత్మకంగా తీసుకొని ఏర్పాట్లు చేసింది. గతం కంటే పుష్కర ఘాట్ల సంఖ్య పెరిగింది. దేశం నలుమూలల నుంచి భక్తులు వచ్చేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. రాజమండ్రి రైల్వే స్టేషన్ అభివృద్ధి కూడా జరుగుతోంది. దేశవ్యాప్తంగా ప్రధాన నగరాల నుంచి వందలాది రైలు సర్వీసులు నడిచేలా ఏర్పాటులు జరుగుతున్నాయి. ఈ విషయంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో ముందుకు అడుగులు వేస్తున్నాయి.

# ఏపీలో 15 లక్షల కొత్త పింఛన్లు!

(మొదటి పేజీ తరువాయి)

**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** ఏపీ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం దిశగా అడుగులు వేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా 15 లక్షల కొత్త పింఛన్లు అందించేందుకు సూత్రప్రాయంగా నిర్ణయించింది. 60 ఏళ్లు నిండిన వృద్ధులతోపాటు 50 ఏళ్లు నిండిన బీసీలు, ఎస్సీలు, ఎస్టీలకు సైతం ఛాన్స్ ఇవ్వనుంది. స్థానిక సంస్థల ఎన్నికల్లోపు కొత్త పింఛన్ల మంజూరుకు నిర్ణయించింది. అదే జరిగితే రాష్ట్రవ్యాప్తంగా 77 లక్షలకు పింఛన్ లబ్ధిదారులు పెరుగుతారు. ప్రతి నెల 700 కోట్ల అదనపు భారం పడనుంది. ఒక్క సామాజిక పింఛన్ల కోసమే ఏడాదికి 41 వేల కోట్ల బడ్జెట్ కేటాయించాల్సి ఉంటుంది.

**ఎన్నికల్లో హామీ మేరకు..**

ప్రస్తుతం రాష్ట్రంలో 28 రకాల సామాజిక పింఛన్లు అందుతున్నాయి. ఎన్టీఆర్ భరోసా పేరుతో వీటిని అమలు చేస్తున్నారు. తాము అధికారంలోకి వస్తే అర్హులైన లబ్ధిదారులకు పింఛన్లు అందిస్తామని హామీ ఇచ్చారు చంద్రబాబు. 50 సంవత్సరాలు దాటిన బీసీ, ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు సైతం పింఛన్లు మంజూరు చేస్తామని సూపర్ సిక్స్ పథకాలలో భాగంగా హామీ ఇచ్చారు. ఇప్పుడు ఆ హామీ నిలబెట్టుకునేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. కొత్తగా సుమారు 15 లక్షల దాకా అర్హులు ఉండవచ్చు అనేది అధికారుల అంచనా. ఎప్పటికీ రాష్ట్రంలో 62.47 లక్షల మందికి పింఛన్లు అందుతున్నాయి. కొత్తగా చేరి లబ్ధిదారులతో కలిసి ఈ సంఖ్య 77 లక్షలకు చేరనుంది. ప్రస్తుతం రూ.2700 కోట్లకు పైగా బడ్జెట్ కోసం నెల నెల ప్రభుత్వం మంజూరు చేస్తోంది. అయితే తాజాగా 15 లక్షల పింఛన్లు పెరిగితే నెలకు 700 కోట్ల రూపాయలు అదనపు భారం పడనుంది. అంటే ప్రతి సంవత్సరం రూ.8400 కోట్ల అదనపు భారం పడనుందన్నమాట.

**ఆ ఘనత చంద్రబాబుదే..**

ఉమ్మడి రాష్ట్రంలో రాజశేఖర్ రెడ్డి హయాంలో సామాజిక పింఛన్లను 69 లక్షల మందికి ఇచ్చేవారు. రాష్ట్ర విభజన తరువాత ఏపీలోని ఉమ్మడి 13 జిల్లాలకు 35.32 లక్షలు పింఛన్లు అందించేవారు. అయితే పింఛన్ మొత్తాన్ని ఎప్పటికప్పుడు పెంచిన ఘనత చంద్రబాబుదే. 2014లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు పింఛన్ మొత్తాన్ని వెయ్యి రూపాయలకు పెంచారు. దివ్యాంగులకు 1500 రూపాయలు ఇచ్చేవారు. 2019 ఎన్నికలకు ముందు వెయ్యి రూపాయలు పింఛన్ అందుకున్న లబ్ధిదారులకు 2000 రూపాయలు, 1500 రూపాయలు పొందుతున్న దివ్యాంగులకు ఏకంగా మూడు వేలకు పెంచారు. అయితే తాను అధికారంలోకి వస్తే సామాజిక పింఛన్ మొత్తాన్ని మూడు వేలకు పెంచుతానని జగన్మోహన్ రెడ్డి హామీ ఇచ్చారు. తీరా అధికారంలోకి వచ్చాక ఆర్థిక భారం దృష్ట్యా ప్రతి సంవత్సరం 250 రూపాయలు చొప్పున పెంచుతానని చెప్పారు. అలా 2024 నాటికి పింఛన్ మొత్తం మూడు వేలకు చేరుకుంది. అయితే తాను అధికారంలోకి వస్తే నాలుగు వేలకు పెంచుతామని చంద్రబాబు హామీ ఇచ్చారు. 2024 మార్చి నుంచి బకాయిలు కూడా అందిస్తామని చెప్పి.. అధికారంలోకి వచ్చిన వెంటనే మూడు నెలల బకాయిలతో పాటు ఏడు వేల రూపాయలను అందించి తన చిత్తశుద్ధిని చాటుకున్నారు. ఇప్పుడు మరో 15 లక్షల పింఛన్లు పెంచి అందించేందుకు సిద్ధపడుతున్నారు. నిజంగా ఇది సాహసమే.

# ఎండ ప్రచండం!

(మొదటి పేజీ తరువాయి)



గతంలో ఎన్నడూ లేని విధంగా వడగాలులు వీస్తుండడంతో జనం విలువలాడుతున్నారు. వరుసగా రెండో రోజు వడదెబ్బతో 30 మందికి పైగా మరణాలు చోటుచేసుకున్నాయి. శనివారం వడదెబ్బకు 40 మంది ప్రాణాలు కోల్పోవడం ఆందోళన కలిగిస్తోంది. మృతుల్లో ఎక్కువగా వృద్ధులు, కూలీలే ఉన్నారు. మరో రెండు రోజులపాటు ఇదే పరిస్థితి కొనసాగుతుందని వాతావరణ శాఖ చెబుతుండడంతో తెలంగాణ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రికార్డు స్థాయిలో 47 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు దాటుతుండడం ఆందోళన కలిగిస్తోంది.

**రాష్ట్రవ్యాప్తంగా అన్నిచోట్ల..**

తెలంగాణ వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో ఎండల తీవ్రత ఒకేలా ఉంది. 46 డిగ్రీలకు తక్కువ కాకుండా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి అంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో 42 డిగ్రీలకు ఉష్ణోగ్రత తగ్గడం లేదు. దీంతో గ్రేటర్ పరిధిలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగింది. 4782 మెగావాట్ల గరిష్ట విద్యుత్ డిమాండ్ నమోదయింది. రోజువారి విద్యుత్ వినియోగం 101. 70 మిలియన్ యూనిట్లుగా రికార్డు అయింది. వడదెబ్బతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో అత్యధికంగా 19 మంది మృత్యువాత చెందారు. మిగతా నల్గొండ, కరీంనగర్, ఖమ్మం జిల్లాల్లో సైతం ఎండ దెబ్బకు తాళలేక ప్రజలు పిట్టల్లా రాలిపోతున్నారు. ఇక మూగజీవాల గురించి చెప్పనవసరం లేదు. వచ్చే మూడు రోజులపాటు తెలంగాణలో ఐదు ఆరు జిల్లాలను మినహాయిస్తే.. అన్నిచోట్ల 42 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వాతావరణ శాఖ చెబుతోంది. ఆదివారం ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండలో తీవ్రస్థాయిలో వడగాలులు వీచాయి. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు ముందుగానే ప్రవేశిస్తాయని వార్తలు వచ్చాయి. దీంతో ప్రజలు రుతుపవనాలపై ఆశలు పెట్టుకున్నారు. కేరళకు రుతుపవనాలు తాకితేనే దేశవ్యాప్తంగా వర్షాలు ప్రారంభం అవుతాయి. అయితే తెలుగు రాష్ట్రాల్లో ఇంతవరకు వర్షాలు జాడలేదు. అడపాదడపా పడుతున్న కొన్ని ప్రాంతాలకు మాత్రమే పరిమితం అవుతోంది వర్షం. మరో మూడు రోజుల పాటు ఇదే పరిస్థితి కొనసాగుతుందని వాతావరణ శాఖ చెబుతుండడం.. ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది.

# ఇక ఎన్డీఏదే రాజ్యసభ!

ప్రధానంగా గుజరాత్ లోని నాలుగు స్థానాలను, రాజస్థాన్ తో పాటు మధ్యప్రదేశ్లో మెజారిటీ స్థానాలను బిజెపి కైవసం చేసుకోనుంది. ఏపీలో నాలుగు సీట్లు సైతం ఎన్డీఏ ఖాతాలో పడనున్నాయి. ఈ పరిస్థితి చూస్తుంటే బిజెపికి మెజారిటీ స్థానాలు రానున్నాయి. కాంగ్రెస్ పార్టీ ఉన్న స్థానాలను కూడా కోల్పోనుంది.

**మూడింట రెండు వంతులు..**

ప్రస్తుతం రాజ్యసభలో బిజెపి బలం 113 గా ఉంది. అదే ఎన్డీఏ విషయానికి వస్తే ఆ బలం 148. రాజ్యసభలో మొత్తం 245 స్థానాలు ఉంటాయి. మూడింట రెండు వంతుల మెజారిటీ సాధించాలంటే 164 సీట్లు అవసరం. తాజాగా జరుగుతున్న ఎన్నికలతో బిజెపి తన సొంత బలాన్ని 120 కు పెంచుకునే అవకాశం ఉంది. ఎన్డీఏ కూటమి బలం 160 కు చేరుకోనుంది. ఈ ఎన్నికల తరువాత కూటమితో కలిసి 2/3 మెజారిటీని అందుకోవడానికి ఇంకా కొద్ది దూరం ఉంటుంది. అయితే కూటమిలో లేకపోయినా చాలా పార్టీలు బిజెపికి అనుకూలంగానే ఉంటాయి. దీంతో మూడంతుల మెజారిటీ ఆ పార్టీ సాధించినట్లే. ఈ ఏడాది చివర్లో ఉత్తరప్రదేశ్లో మరికొన్ని ఖాళీలు రానున్నాయి. బిజెపి ఖాతాలో రాజ్యసభ పదవులు పడనున్నాయి. అంటే బిజెపి దేశ రాజకీయ చరిత్రలో సరికొత్త శకానికి నాంది పలకనుందన్నమాట. ఎటువంటి బిల్లులైనా సునాయాసంగా ఈసారి పాస్ కానున్నాయన్నమాట.

# రాజ్యసభ రేసులో నాగబాబు!

చెప్పలేం కానీ జనసేనకు ఒక రాజ్యసభ పదవిని చంద్రబాబు విడిచిపెట్టినట్లు ప్రచారం నడుస్తోంది.

**లింగమనేని రమేష్ పేరు..**

జనసేన నుంచి రాజ్యసభకు నిన్నటి వరకు లింగమనేని రమేష్ పేరు వినిపించింది. ఆయన ప్రముఖ పారిశ్రామికవేత్తగా ఉన్నారు. పవన్ కళ్యాణ్ కు అత్యంత సన్నిహితులు కూడా. అందుకే ఆయన పేరును దాదాపు ఖరారు చేసినట్లు ప్రచారం నడిచింది. అయితే ఇప్పుడు సడన్ గా మెగా బ్రదర్ నాగబాబు పేరు వినిపిస్తోంది. ఆయన ప్రస్తుతం ఎమ్మెల్సీగా ఉన్నారు. క్యాబినెట్ లోకి తీసుకుంటామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. అయితే నాగబాబు కు కేంద్ర రాజకీయాలు అంటేనే ఇష్టం. రాజ్యసభ ద్వారా పెద్దల సభకు వెళ్లాలన్నది ఆయన లక్ష్యం. గత రెండుసార్లు సమీకరణల దృష్ట్యా సాధ్యం కాలేదు. అందుకే ఈసారి తప్పకుండా తనకు అవకాశం ఇవ్వాలని నాగబాబు కోరుతున్నట్లు తెలుస్తోంది.

**కేంద్ర రాజకీయాలంటే ఇష్టం..**

ఆది నుంచి ఎంపీ కావాలన్నది నాగబాబు లక్ష్యం. జనసేనకు దక్కే అవకాశాల ద్వారా కేంద్ర మంత్రి కావాలన్నది ఆయన ఆలోచన. 2019లో సైతం నరసాపురం పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేశారు నాగబాబు. 2024 ఎన్నికల్లో సైతం అనకాపల్లి పార్లమెంట్ స్థానం నుంచి ఎంపీగా పోటీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. పార్లమెంటరీ నియోజకవర్గం పరిధిలో ఒక ఇంటిని కూడా తీసుకున్నారు. ఎంపీ గా ఎన్నిక కావడం ద్వారా.. కేంద్ర మంత్రివర్గంలో చోటు దక్కించుకోవాలన్నది నాగబాబు ప్రణాళిక. అయితే ఇంతలో సమీకరణలు మారడంతో నాగబాబుకు అక్కడ ఛాన్స్ దక్కలేదు. అనకాపల్లి నుంచి సీఎం రమేష్ బిజెపి అభ్యర్థిగా పోటీ చేశారు. అయితే పార్టీతో పాటు కూటమి కోసం పనిచేశారు నాగబాబు.. కూటమి అధికారంలోకి రావడంతో రాజ్యసభ పదవి దక్కుతుందని ఆశలు పెట్టుకున్నారు. ఇప్పటికే రాష్ట్ర మంత్రివర్గంలో పవన్ కళ్యాణ్ ఉన్నారు. అందుకే రాష్ట్ర మంత్రి కావడం కంటే కేంద్ర మంత్రివర్గంలో చోటు దక్కడమే మేలు అనే ఆలోచనలో పవన్ తో పాటు నాగబాబు ఉన్నట్లు తెలుస్తోంది. అందుకే ఇప్పుడు రాజ్యసభ ఆశావహుడిగా నిలిచినట్లు సమాచారం. మరి ఎలాంటి నిర్ణయాలు ఉండబోతున్నాయో చూడాలి.

# డీకే అరుణకు బిజెపి పగ్గాలు!

భావన బిజెపి శ్రేణుల్లో ఉంది. అందుకే ఈసారి మార్పు ఖాయమన్న టాక్ నడుస్తోంది.

**సీఎం సొంత జిల్లా నుంచి.**

ప్రముఖంగా ఈసారి రెడ్డి సామాజిక వర్గానికి చెందిన మహిళ నేతకు బిజెపి పగ్గాలు ఇవ్వాలని హై కమాండ్ భావిస్తున్నట్లు సమాచారం. తద్వారా తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి దూకుడుకు కళ్లెం వేయాలని చూస్తున్నట్లు తెలుస్తోంది. ఆయన సొంత జిల్లాకు చెందిన, అదే సామాజిక వర్గానికి చెందిన మహబూబ్నగర్ ఎంపీ డీకే అరుణకు బిజెపి పగ్గాలు అందిస్తారని తెలుస్తోంది. ఇప్పటికే ఆమె రేవంత్ రెడ్డిపై ఒంటి కాలిపై లేస్తుంటారు. ఆమెకు బిజెపి బాధ్యతలు ఇవ్వడం ద్వారా రేవంత్ కు కళ్లెం వేయాలని చూస్తోంది బిజెపి హై కమాండ్. తెలంగాణ రాజకీయాల్లో డీకే అరుణ ప్రస్థానం ప్రత్యేకమైనది. 1996లో మహబూబ్నగర్ లోక్సభ నియోజకవర్గం నుంచి టీడీపీ తరఫున పోటీ చేశారు డీకే అరుణ. స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయారు. తరువాత కాంగ్రెస్ గూటికి చేరి 1998 సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి ఆ పార్టీ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. 1999 అసెంబ్లీ ఎన్నికల్లో గద్వాల స్థానంలో టిడిపి అభ్యర్థి చేతిలో మరోసారి ఆమెకు ఓటమి ఎదురైంది. 2004లో కాంగ్రెస్ పార్టీ టికెట్ దక్కకపోవడంతో తిరుగుబాటు అభ్యర్థిగా.. సమాజ్వాది పార్టీ తరఫున పోటీ చేసి విజయం సాధించారు. ఆ ఎన్నికల్లో జిల్లాలోని అత్యధిక మెజారిటీని ఆమె సొంతం చేసుకున్నారు. 2009లో కాంగ్రెస్ తరఫున పోటీ చేసి గెలిచిన ఆమె కు రాజశేఖరరెడ్డి క్యాబినెట్లో మంత్రిగా అవకాశం దక్కింది. 2014లో సైతం అదే గద్వాల నుంచి గెలిచి హ్యాట్రిక్ కొట్టారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం ఆమెకు ఓటమి ఎదురైంది. అనంతరం ఆమె భారతీయ జనతా పార్టీలో చేరారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో బిజెపి తరఫున పోటీ చేసి ఓడిపోయారు. 2024 ఎన్నికల్లో మాత్రం ఎంపీగా పోటీ చేసి విజయం సాధించారు.

**జిల్లాపై మంచిపట్టు..**

దూకుడు కలిగిన మహిళా నేతగా డీకే అరుణ కు మంచి పేరు ఉంది. మహబూబ్నగర్ జిల్లా పై గట్టి పట్టు ఉంది. ఆమె కాంగ్రెస్ లో ఉన్నప్పుడు.. ప్రస్తుత సీఎం రేవంత్ టిడిపిలో ఉండేవారు. వారి మధ్య ఫైట్ ఓ రేంజ్ లో నడిచేది. ఇప్పుడు కూడా డీకే అరుణ సీఎం రేవంత్ రెడ్డి పై తరచూ విరుచుకుపడుతుంటారు. మంచి వాగ్దాటి ఉన్న నేత. రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి వచ్చిన వారు కావడంతో దూకుడు రాజకీయాలు చేస్తుంటారు. అందుకే ఆమెకు బిజెపి పగ్గాలు అందించడం ద్వారా.. రేవంతు దూకుడుకు కళ్లెం వేయాలని బిజెపి పెద్దలు భావిస్తున్నారు. త్వరలో ఆమె నియామకానికి సంబంధించి ఒక ప్రకటన రానున్నట్లు సమాచారం.

# హైదరాబాద్ నడిబొడ్డున ఎన్టీఆర్ విగ్రహం!

(మొదటి పేజీ తరువాయి)


సాధించారు నందమూరి తారకరామారావు. అటువంటి నేతకు తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అపూర్వ గౌరవాన్ని కల్పిస్తోంది. ఎన్టీఆర్ అంటే తమకు చాలా అభిమానం అని చెప్పుకునే కెసిఆర్ కూడా ఇటువంటి ప్రయత్నం చేయలేదు. అయితే తెలంగాణలో తెలుగుదేశం పార్టీ అభిమానులను తమ వైపు తిప్పుకునేందుకు సీఎం రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా ఎన్టీఆర్ విగ్రహాన్ని హైదరాబాద్ నడిబొడ్డున ఉన్న అమీర్పేట్ లో ఏర్పాటు చేసినట్లు అర్థం అవుతోంది. ఈనెల 28న ఎన్టీఆర్ 14వ జయంతిని పురస్కరించుకొని ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించేందుకు రంగం సిద్ధం అయింది. ఈ ప్రతిష్టాత్మక విగ్రహాన్ని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేటలో ప్రఖ్యాత శిల్పి రాజ్ కుమార్ వడియార్ ఆధ్వర్యంలో రూపుదిద్దుకొంది.

**ఉత్కంఠను తరలించుతూ..**

వాస్తవానికి ఎన్టీఆర్ విగ్రహాన్ని ఎక్కడ ఏర్పాటు చేస్తారు అనే ఉత్కంఠను తెరదించుతూ.. అమీర్పేట మైత్రివనం జంక్షన్ వద్ద దీనిని ప్రతిష్టించనున్నారు. ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ ఈ విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ చేశారు. శిల్పి రాజ్ కుమార్ వడియార్ ఈ విగ్రహాన్ని అద్భుతంగా తీర్చిదిద్దారు దాదాపు పది అడుగుల ఎత్తు ఉండే ఈ కంచు విగ్రహం కోసం ప్రత్యేకమైన లోహాలను వినియోగించారు. ఎన్టీఆర్ రూపం ఉట్టిపడేలా.. ఆయన చిరునవ్వు.. రాజసం ప్రతిబింబించేలా ఈ విగ్రహాన్ని సిద్ధం చేసి ఇప్పటికే హైదరాబాద్ తరలించారు. రాజ్ కుమార్ వడియార్ గతంలో చాలామంది ప్రముఖుల విగ్రహాలను రూపొందించి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు సాధించారు.

**టిడిపి క్యాడర్ కోసమే..**

తెలంగాణలో తెలుగుదేశం పార్టీ సందిగ్ధ స్థితిని ఎదుర్కొంటూ వచ్చింది. ప్రస్తుతం అక్కడ నాయకత్వం లేని క్యాడర్ ఉంది పుష్కలంగా.. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల సమయంలో టిడిపి క్యాడర్ను ఆకర్షించేందుకుగాను అమీర్పేటలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. అంతటితో ఆగకుండా ఎన్టీఆర్కు భారతరత్న కూడా ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేస్తామని క్యాబినెట్లో ప్రకటించారు సీఎం రేవంత్ రెడ్డి. అయితే ఇప్పుడు ఇచ్చిన హామీ మాదిరిగా ఎన్టీఆర్ నిలువెత్తు విగ్రహాన్ని ఏర్పాటు చేసి.. ఈనెల 28న ఆవిష్కరించేందుకు ఏర్పాట్లు చేస్తుండడం విశేషం.








# శివన్నగూడ సర్పంచ్ నిజాయితీ పాలనపై కుట్రపూరిత విషప్రచారం

## రాజకీయ లబ్ధి కోసమే అక్రమ వెంచర్ల నాటకమా?

మర్రిగూడ(క్రైమ్ మిర్రర్):

**శివన్నగూడ గ్రామంలో ప్రస్తుత సర్పంచ్ అందిస్తున్న అవినీతి రహిత, పారదర్శక పాలనను జీర్ణించుకోలేక, కొందరు స్వార్థపరులు రాజకీయ రంగు పులిమి కుట్రపూరితమైన విషప్రచారానికి తెరలేపారు. గ్రామంలో గతంలో కొందరు వ్యక్తులు పింఛన్లు, ఇందిరమ్మ ఇండ్లు ఇప్పిస్తామని నమ్మబలికి, అమాయక ప్రజలను మోసం చేస్తున్న వ్యవహారాలను, ప్రస్తుత సర్పంచ్ సమర్థవంతంగా అడ్డుకోవడమే కాకుండా, ప్రజాధనాన్ని దోచుకునే శక్తులకు అడ్డుకట్ట వేశారు.**

దీనితో ఉపాధి కోల్పోయిన సదరు మోసగాళ్లు, కొందరు కంట్రిబ్యూటర్లతో చేతులు కలిపి, సర్పంచ్ ప్రతిష్టను దిగజార్చేందుకు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని, క్షేత్రస్థాయి పరిశీలనలో స్పష్టమవుతోంది. 2016లో గ్రామపంచాయతీ నిబంధనలు, అనుమతులతో ఏర్పాటైన ఒక వెంచర్ అంశాన్ని ఇప్పుడు తెరపైకి తెచ్చి, దానికి ప్రస్తుత సర్పంచ్‌కు ముడిపెట్టడం కేవలం రాజకీయ కక్షసాధింపు చర్యేనని, రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. సదరు వెంచర్లకు సంబంధించిన మౌలిక సదుపాయాలు, నిబంధనలపై కనీస అవగాహన కూడా లేకుండా, అసత్య ప్రసారం చేయడం సదరు కంట్రిబ్యూటర్ల అవగాహన రాహిత్యాన్ని, పక్షపాత వైఖరిని ఎత్తిచూపుతోంది. ఒకపక్క సర్పంచ్ తన ఉదార స్వభావంతో, ఆపదలో ఉన్న పేద కుటుంబాలను ఆదుకుంటూ, వ్యక్తిగతంగా ఆర్థిక సహాయం అందిస్తూ, గ్రామాభివృద్ధికి నిరంతరం శ్రమిస్తుంటే, ఆ మానవతా దృక్పథంలో కూడా




తప్పులు వెతకడం, సదరు దుష్ప్రచారకుల వికృత మనస్తత్వానికి అద్దం పడుతోంది. నిజాయితీగా, నిస్వార్థంగా సేవలందిస్తున్న ప్రజా ప్రతినిధిపై ఇలాంటి నిందలు వేయడం, సమాజానికి తప్పుడు సంకేతాలు పంపుతుందని, ఇలాంటి కుట్రలను గ్రామ ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మరని, మండల స్థాయి నాయకులు, గ్రామ పెద్దలు సర్పంచ్‌కు పూర్తి మద్దతుగా నిలుస్తూ, ఈ తప్పుడు ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నారు. అప్పటి నిబంధనలను నేటి పరిస్థితులకు లెంక పెడుతూ, అప్పటి గ్రామ పంచాయతీ అధికారాలను తప్పుదోవ పట్టిస్తున్నారు..

# మహాదేవపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

### 2007--2009 బ్యాచ్ విద్యార్థుల సందడి..


### పాత జ్ఞాపకాలతో భావోద్వేగ క్షణాలు



**క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2007--2009 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించబడింది. దాదాపు 50 మందికి పైగా పూర్వ విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొని పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు. ఏళ్ల తర్వాత ఒక్కచోట చేరిన స్నేహితులు కళాశాల రోజుల అనుభవాలను పంచుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు. చదువుకున్న తరగతి గదులు, కళాశాల ప్రాంగణం, అప్పటి ఉపాధ్యాయులను గుర్తు చేసుకుంటూ విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. కొందరు ప్రస్తుతం వివిధ రంగాల్లో ఉద్యోగాలు, వ్యాపారాల్లో స్థిరపడగా, మరికొందరు సామాజిక సేవా కార్యక్రమాల్లో కొనసాగుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులను సన్మానించి వారికి కృతజ్ఞతలు తెలిపారు. తమ జీవితంలో కళాశాల అందించిన విలువలు, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం ఎంతో ఉపయోగపడిందని పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు, సరదా ఆటలు నిర్వహించి సందడి చేశారు. ఈ సమ్మేళనం ద్వారా పాత స్నేహ బంధాలు మరింత బలపడినట్లు పాల్గొన్న వారు తెలిపారు. ప్రతి సంవత్సరం ఇలాంటి ఆత్మీయ సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించుకున్నారు.

# నార్సింగి పోలీసుల అదుపులో స్పీడ్ వీరుడు


### ఔటర్ రింగ్ రోడ్‌పై 200 కిలోమీటర్ల వేగంతో రచ్చ.. సోషల్ మీడియాలో వీడియో వైరల్



**గండిపేట్ :. ( క్రైమ్ మిర్రర్ ):** హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్‌పై అత్యంత ప్రమాద కరంగా వాహనం నడిపి, ఆ వీడియోను సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేసిన వ్యక్తిని నార్సింగి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిర్లక్ష్యపు డ్రైవింగ్‌తో ప్రజల్లో భయాందోళనలు కలిగించిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.నార్సింగి పోలీసుల వివరాల ప్రకారం, రోడ్డు గస్తీ అధికారి కారింగుల సాయిరాం ఇచ్చిన ఫిర్యాదు మేరకు మే 10వ తేదీ ఉదయం సుమారు 10:30 గంటల సమయంలో ఒక వ్యక్తి వోక్స్‌వ్యాగన్ విర్టస్ కారును టీజీటీఆర్ 2026 తాత్కాలిక నంబర్‌తో నార్సింగి టోల్‌గేట్ నుంచి టీజీపీఏ టోల్‌గేట్ వైపు ఔటర్ రింగ్ రోడ్‌పై గంటకు 200 కిలోమీటర్లకు పైగా వేగంతో నిర్లక్ష్యంగా నడిపాడు. ఈ ఘటనను మొబైల్ ఫోన్‌లో చిత్రీకరించి యశ్వంత్ రెడ్డి పేరుతో ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది.ఈ ఘటనపై నార్సింగి పోలీస్ స్టేషన్‌లో క్రైం నెంబర్ 396/2026 కింద భారతీయ న్యాయ సంహిత సెక్షన్లు 125, 281 ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. విచారణలో నిందితుడిగా కొత్తపల్లి యశ్వంత్ రెడ్డి (32), ఆల్కాపూర్ టౌన్‌షిప్, పుప్పాలగూడ నివాసి అని గుర్తించారు.పోలీసుల విచారణలో యశ్వంత్ రెడ్డి ఏప్రిల్ 2026లో వోక్స్‌వ్యాగన్ విర్టస్ వాహనం కొనుగోలు చేసినట్లు, వాహనం పనితీరును పరీక్షించేందుకు ఔటర్ రింగ్ రోడ్‌పై ప్రవేశ ద్వారం నెంబర్ 18(ఏ) నుంచి వాహనాన్ని సుమారు 200 కిలోమీటర్ల వేగంతో నడిపినట్లు అంగీకరించినట్లు తెలిపారు. నేరానికి ఉపయోగించిన కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.ప్రజలకు నార్సింగి పోలీసులు హెచ్చరిక జారీ చేస్తూ.. నిర్లక్ష్యపు డ్రైవింగ్, ప్రమాదకర విన్యాసాలు చేసి వాటిని సోషల్ మీడియాలో ప్రచారం చేయడం తీవ్రమైన నేరమని పేర్కొన్నారు. ఇటువంటి చర్యలు అమాయక ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారి ఘోర రోడ్డు ప్రమాదాలకు దారితీసే అవకాశముందని స్పష్టం చేశారు.ఈ కేసు దర్యాప్తు సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ ఉన్నతాధికారుల పర్యవేక్షణలో కొనసాగుతున్నట్లు నార్సింగి స్టేషన్ హౌస్ ఆఫీసర్ జి. హరి కృష్ణ రెడ్డి తెలిపారు.

# తొలి ఎఐ ఆధారిత ఫిర్యాదు రికార్డర్

హైదరాబాద్: దేశంలోనే తొలి ఎఐ ఆధారిత ఫిర్యాదు రికార్డర్ 'ఎఐ కాప్‌రైటర్' యాప్‌ను హైదరాబాద్ సిపి సజ్జనార్ శనివారం ఆవిష్కరించారు. దీని ద్వారా 10కి పైగా భాషల్లో ఫిర్యాదులు నమోదు చేసే అవకాశం ఉందన్నారు. చెప్పిన విషయాలను వెంటనే టెక్స్ట్‌గా మార్చి అనువదించవచ్చని చెప్పారు. ఫిర్యాదు వివరాలు ఆటోమేటిక్‌గా పిడిఎఫ్ రూపంలో సేవ్ అయ్యే సదుపాయం ఉందన్నారు. వలస కార్మికులు, పర్యాటకులు, మహిళలు, వృద్ధులకు పెద్ద ఊరట లభిస్తుందని తెలిపారు. భాష న్యాయానికి అడ్డంకి కాకూడదన్న లక్ష్యంతో ఎఐను వినియోగిస్తున్నట్టు వివరించారు.



క్రైమ్ మిర్రర్

# ఎడిటోరియల్

4

సోమవారం

25-5-2026

## ఎడిటోరియల్




# ఏపీలో గునపం గొడ్డలి రాజకీయాలు

**వైసీపీ రాజకీయ వ్యూహాలు ఏంటో కానీ స్పందించాల్సిన వాటి మీద చాలా లేటుగా రియాక్ట్ అవుతారని అంటారు. అప్పటికే జరగాల్సినది జరిగిపోతుందని కూడా పార్టీలోనూ అంతర్మథనం చెందుతూ ఉంటారు. ప్రభుత్వంలో ఉన్నపుడు కానీ అంతకు ముందు విపక్షంలో ఉన్నపుడు కానీ ప్రత్యర్థులు చేసే ఘాటు విమర్శల మీద వెంటనే రియాక్ట్ కాకపోవడం వల్ల భారీ మూల్యాన్ని చెల్లించుకోవాల్సి వచ్చిందని వైసీపీ నేతలు గుర్తు చేసుకుంటూ ఉంటారు. రాజకీయాల్లో టైం టైమింగ్ ఈ రెండూ చాలా ముఖ్యం. ఈ విషయంలో వైసీపీ ఎపుడూ వెనకబాటుతోనే ఉంటోంది అని అంటున్నారు.**

తెలుగుదేశం పార్టీ వైసీపీని విమర్శించే విషయంలో ఎప్పటికప్పుడు కొత్త వ్యూహాలతో సిద్ధంగా ఉంటుంది. అధికారంలో వైసీపీ ఉన్నప్పుడు అయిదేళ్ళూ జగన్ ని సైకో అంటూ వైసీపీని సైకో పార్టీ అని విపరీతంగా టీడీపీ ప్రచారం చేసింది. దానిని వైసీపీ సీరియస్ గా తీసుకోలేదు, ఫలితాలు వచ్చిన తరువాత ఏమి జరిగింది అన్నది బోధపడింది అని అంటున్నారు. ఇపుడు కొత్తగా గొడ్డలి పార్టీ అని వైసీపీకి పేరు పెట్టి టీడీపీ పెద్ద ఎత్తున జనంలోకి దానిని ప్రచారం చేస్తోంది. ఇది చాలా రోజులుగా జరుగుతోంది. అయితే వైసీపీ ఇపుడు ఆలస్యంగా మేలుకొంది. అందుకే వరసబెట్టి తమ పార్టీకి చెందిన మాజీ మంత్రుల చేత కౌంటర్లు ఇప్పిస్తోంది. ఇక మాజీ మంత్రి నెల్లూరు జిల్లా వైసీపీ అధ్యక్షుడు కాకాణి గోవర్ధనరెడ్డి తాజాగా మీడియాతో మాట్లాడుతూ తమది గొడ్డలి పార్టీ అని ప్రచారం చేస్తున్న చంద్రబాబు మీద తీవ్ర విమర్శలు చేశారు. మామ పార్టీకి గునపం పెట్టి వెన్నుపోటు పొడిచింది బాబు కాదా అని ప్రశ్నించారు. ఆ మీదట ప్రతీ ఎన్నికల్లో ప్రజలకు హామీలు ఇవ్వడం వాటిని నెరవేర్చకుండా గునపంతో జనాలను వెన్నుపోటు పొడవడం కూడా బాబుకు అలవాటే అని ఆయన ఫైర్ అయ్యారు. మీ పార్టీ గునపం పార్టీ అందుకే గునపం గుర్తునే పెట్టుకోవాలని ఆయన సూచించారు. ఆయన తరహాలో మరింత మంది మాజీ మంత్రులు నాయకులు కూడా టీడీపీ మీద విమర్శలు చేస్తున్నారు. ఈ తరహా విమర్శలు కానీ ప్రచారం కానీ న్యూట్రల్ సెక్షన్లలో తీవ్రమైన ప్రభావం చూపిస్తాయని అంటున్నారు విద్యావంతులు మేధావులు అలాగే చదువరులు ఉద్యోగస్తులు తటస్థులలో వీటి మీద చర్చ సాగుతూ ఉంటుంది. ఈ సెక్షన్లు ఎన్నికల సమయంలో కీలకంగా మారుతారు. మౌత్ పబ్లిసిటీ ద్వారా వీరి అభిప్రాయాలు మిగిలిన జనాలకు చేరి ఫలితం మీద పడుతుంది అన్న విశ్లేషణలు ఉన్నాయి. అందుకే టీడీపీ వైసీపీ విషయంలో ఎప్పటికపుడు కొత్త ఎత్తుగడలతో ముందుకు సాగుతోంది. కానీ వైసీపీ మాత్రం ఇవేమీ పట్టినట్లుగా ఉండడం వల్ల ఇబ్బంది పడుతోంది అని ఆ పార్టీ నాయకులు అంటున్నారు. సరికొత్త విధానానికి ప్రభుత్వం శ్రీకారం.. ఇపుడు గొడ్డలి అంటే వైసీపీ గుర్తుకు వచ్చేలా ఉధృతమైన ప్రచారం సాగిన నేపథ్యంలో వైసీపీ గునపం అని వెన్నుపోటు అని టీడీపీ మీద కౌంటర్లు వేస్తోంది. మరి ఇవి జనంలోకి ఏ మేరకు వెళ్తాయి ఒక వేళ వెళ్తే ఈ రెండింటి మీద జనాలలో చర్చ జరిగి వారు ఏ వైపు మొగ్గు చూపిస్తారు అన్నది చూడాల్సి ఉంది. ఇవన్నీ పక్కన పెడితే గొడ్డలి పార్టీ అని అంటూంటే వైసీపీకి ఎక్కడో గట్టిగా గుచ్చుకుంటోంది అని అంటున్నారు. మరి వైసీపీ సున్నితత్వం మీదనే టీడీపీ దెబ్బ కొడుతూ రాజకీయ రచ్చకు తెర తీస్తోందా అన్నదే అసలైన చర్చ.

# అవసరం కాదు... ఆప్యాయతే బంధానికి ప్రాణం!

మనం మన జీవిత ప్రయాణంలో ఎంతమందిని కలుస్తాం? వందల మందిని, బహుశా వేలమందిని కూడా కావచ్చు. కానీ వారిలో నిజంగా మన కష్టసుఖాలను పంచుకునే మన వాళ్ళు ఎంతమంది? ఈ ప్రశ్నకు సమాధానం వెతికేటప్పుడు చేతి వేళ్ళు చాలినా చాలకపోవచ్చు. ఎందుకు ఇలా జరుగుతోంది? ఎందుకంటే నేటి ఆధునిక సమాజంలో బంధాలు నిర్మించబడే ప్రాథమిక విధానమే పూర్తిగా మారిపోయింది. నేడు సంబంధాలు ప్రేమతో కాదు, అవసరంతో ముడిపడుతున్నాయి, నిష్కల్మషమైన ఆప్యాయతతో కాదు, స్వార్థపూరితమైన ప్రయోజనంతో ముడిపడుతున్నాయి. ఈ క్లిష్టమైన నేపథ్యంలో నిజమైన బంధం అంటే ఏమిటి? అనే ప్రశ్న ప్రతి ఒక్కరి మనసును తట్టి లేపుతోంది. దానికి జవాబు చెప్పే ఏకైక జీవన వేదం ఒక్కటే అవసరం కోసం కాదు, కేవలం స్వచ్ఛమైన ఆప్యాయత కోసం మాత్రమే బంధం నిలబడాలి. మానవ జీవితం అనేది విభిన్న బంధాల సమాహారం. ఒక శిశువు తల్లి గర్భంలో ఉన్నప్పటి నుంచే మానవాళికి తొలి బంధం ఏర్పడుతుంది అది అమ్మతో ఏర్పడే అనుబంధం. ఆ పవిత్రమైన స్పర్శ, ఆ వెచ్చదనం, ఆ నిరంతర రక్షణ వాటిలో ఎలాంటి స్వార్థపూరిత అవసరం కానీ, లౌకిక ప్రయోజనం కానీ అస్సలు ఉండవు. అక్కడ కేవలం పచ్చి ప్రేమ మరియు అమాయకత్వం మాత్రమే పరిమళిస్తాయి. తల్లి తన బిడ్డకు పాలివ్వడం తన వ్యక్తిగత ప్రయోజనం కోసం కాదు. అలాగే ఆ చిన్న శిశువు ఏడవడం తన స్వార్థం కోసం కాదు. అది పూర్తిగా ప్రకృతి సిద్ధమైన, స్వచ్ఛమైన బంధం. అత్యంత నిర్మలమైన అనుభూతి. ఇదే విశ్వంలో నిజమైన బంధానికి ఆద్యంతాలు లేని ఆదిరూపం.



కానీ వయసు పెరిగే కొద్దీ మనిషిలో ఆలోచనలు మారిపోతాయి. బడిలో చేరినప్పుడు కొత్త స్నేహాలు ఏర్పడతాయి. వాటిలో కొన్ని నిజమైనవి అయితే, మరికొన్ని తాత్కాలిక అవసరానికి పుట్టినవి ఉంటాయి. నీకు పెన్ ఉందా? నాకు ఇవ్వు అని వస్తువుల మార్పిడితో మొదలైన స్నేహం, ఒక రోజు పెన్ లేకపోతే ముగిసిపోవచ్చు. కానీ నువ్వు ఏడుస్తున్నావు, నేను నీకు తోడుగా దగ్గరున్నాను అని భావోద్వేగంతో మొదలైన స్నేహం జీవితకాలం పాటు చెక్కుచెదరకుండా నిలిచి ఉంటుంది. ఈ చిన్న వ్యత్యాసాన్ని లోతుగా అర్థం చేసుకున్నవారే జీవితంలో నిజమైన బంధాలను సముచితంగా పెంచుకుంటారు. నేటి ఆధునిక డిజిటల్ యుగంలో మనుషుల మధ్య బంధాలు చాలా సులభంగా ఏర్పడుతున్నాయి. ఒక వాట్సాప్ గ్రూప్‌లో ఎవరినైనా చేర్చుకుంటే స్నేహం అయిపోయినట్టు, ఇన్‌స్టాగ్రామ్‌లో ఒకరినొకరు ఫాలో చేస్తే అమితమైన అభిమానం అయిపోయినట్టు భ్రమిస్తున్నాం. కానీ దురదృష్టవశాత్తూ ఆ వర్చువల్ స్నేహాలు నిజంగా కష్టం వచ్చినప్పుడు ఎక్కడికి పోతాయో ఎవరికీ తెలియదు. సందేశానికి బ్లూ టిక్ వచ్చినా అవతలి నుండి సరైన రిప్లై రాదు. సమస్య తీవ్రతను సీన్ చేసినా ఆపన్నహస్తం అందదు. ఇది పూర్తిగా అవసరంపై నిర్మించిన కృత్రిమ బంధాల వల్ల కలిగే వేదన. ఒక వ్యాపారి నీతో చాలా స్నేహంగా ఉంటాడు ఎందుకంటే నీవల్ల అతనికి ఏదో ఒక లాభం ఉంటుంది. ఆ లాభం లేదా ప్రయోజనం పోయే రోజున, ఆ స్నేహం కూడా మంచులా కరిగిపోతుంది. ఆఫీసులో ఒక సహోద్యోగి నీకు చాలా సహాయపడతాడు ఎందుకంటే భవిష్యత్తులో ఒక రోజు నీ అవసరం అతనికి పడవచ్చు. ఆ అవసరం తీరిపోయిన మరుసటి రోజే, ఆ బంధం కూడా శాశ్వతంగా తీరిపోతుంది. ఇలాంటి తాత్కాలిక బంధాలు మనిషిని అంతర్గతంగా తీవ్రమైన ఒంటరితనంలోకి నెట్టేస్తాయి. చుట్టూ వందల మంది మనుషులతో చుట్టుముట్టబడినా, లోపల ఒక తెలియని శూన్యం నిండి ఉంటుంది. ఎందుకంటే నన్ను నా స్వార్థం కోసం కాకుండా, నాకు నేనుగా ప్రేమిస్తూ నా ఉనికిని గౌరవించే వారు ఎవరైనా ఉన్నారా? అనే ప్రాథమిక ప్రశ్నకు సమాధానం దొరకదు. నిజానికి ఆప్యాయత అంటే ఏమిటి? అది కేవలం పైపై మాటలతో నేను నిన్ను ప్రేమిస్తున్నాను అని చెప్పడం కాదు. అర్ధరాత్రి వేళ తీవ్రమైన మానసిక ఆందోళనతో ఒకరు ఏడుస్తున్నప్పుడు వారి ఫోన్ ఎత్తి ఓదార్చడం ఆప్యాయత. జీవితంలో లేదా పరీక్షలో ఘోరంగా ఫెయిలయినప్పుడు ఫర్వాలేదు మిత్రమా, తర్వాత మళ్ళీ ప్రయత్నిద్దాం అని భుజంపై ధైర్యంగా చెయ్యి వేయడం ఆప్యాయత. శారీరక నొప్పితో జ్వరం వచ్చినప్పుడు అడగకుండానే మందులు తీసుకుని వచ్చే చిన్న శ్రద్ధ ఆప్యాయత. అది కేవలం పండగ రోజులలో మాత్రమే ఫార్మాలిటీ కోసం గుర్తు చేసుకోవడం కాదు, ఏ విశేషం లేని సాధారణ రోజులలో కూడా ఈ రోజు ఎలా ఉన్నావు? అని ఆత్మీయంగా అడగడం. సత్యమైన ఆప్యాయతకు లెక్కింపులు, తులనాత్మక అంచనాలు అస్సలు ఉండవు. నేను నీకు గతంలో ఇంత సహాయం చేశాను, కాబట్టి నువ్వు నాకు ఇప్పుడు ఇంత చేయాలి అనే వ్యాపార లెక్క ఆప్యాయతలో ఎప్పటికీ ఉండదు. అది నిరంతరం పవిత్రంగా ప్రవహించే జీవనది లాంటిది ఎక్కడా ఆగకుండా, ఏ ప్రతిఫలాన్ని ఆశించకుండా, తనను తాను పూర్తిగా అర్పించుకుంటూ సాగిపోతుంది.

మన అమూల్యమైన తెలుగు సంస్కృతిలో ఇందుకు అద్భుతమైన జీవన ఉదాహరణలు ఎన్నో ఉన్నాయి. ఒక అమ్మమ్మ తన మనవలకు రాత్రి పూట కథలు చెప్పేటప్పుడు ఆమె ఏ విధమైన భౌతిక ప్రతిఫలమూ కోరదు. ఆ అమాయక ప్రేమలో అపారమైన స్వచ్ఛత ఉంటుంది. అదే విధంగా ఒక నిజమైన హృదయం గల మిత్రుడు మీ విజయానికి మనస్ఫూర్తిగా సంతోషపడతాడు ఎలాంటి అసూయ లేకుండా. మీ వైఫల్యానికి అంతర్గతంగా దుఃఖపడతాడు మిమ్మల్ని గేలి చేయకుండా. ఇదే నిజమైన ఆప్యాయత. ఇదే శాశ్వతమైన బంధం. ప్రస్తుతం మనం ఒక వింతైన సామాజిక మానసిక దశలో జీవిస్తున్నాం. ఒక వైపు సోషల్ మీడియా ప్లాట్‌ఫార్మ్‌లో మనకు వందలు, వేల సంఖ్యలో ఫ్రెండ్స్ కనిపిస్తున్నారు. కానీ మరో వైపు గుండె బరువును దించుకోవడానికి మనసు విప్పి మాట్లాడగలిగే ఒక్కటంటే ఒక్క నమ్మకమైన వ్యక్తి కూడా దొరకడం లేదు. ఇది సమాజంలో బంధాల పరిమాణం పెరగడం కాదు వాటి అంతర్గత నాణ్యత పూర్తిగా తరగడం.

ఎందుకు ఇలాంటి దారుణ పరిస్థితి వచ్చింది? ఎందుకంటే మనం చిన్నతనం నుండే బంధాలను ఒక ఆర్థిక పెట్టుబడిగా చూడటం నేర్చుకున్నాం. ఇతనికి ఇప్పుడు సహాయం చేస్తే, భవిష్యత్తులో ఒక రోజు నాకు తిరిగి ఉపయోగపడతాడుఅనే స్వార్థపూరిత లెక్క మానవ సంబంధాలలో మొదలైంది. ఇది కేవలం ఒక వ్యాపారం అంతేకానీ బంధం ఎంతమాత్రం కాదు. వ్యాపారం ఎల్లప్పుడూ లాభనష్టాల ప్రయోజనంతో నడుస్తుంది. కానీ బంధం కేవలం నిష్కల్మషమైన ప్రేమతో మాత్రమే నడుస్తుంది. నేడు ప్రతి ఇంట్లోనూ దురదృష్టవశాత్తూ ఇదే దృశ్యం కనిపిస్తోంది. కొంతమంది పిల్లలు తమ కన్న తల్లిదండ్రులను వారు ముసలి వారయ్యారు, వారిని చూసుకోవడం ఒక భారమైన బాధ్యత అనే కోణంలో చూస్తున్నారు తప్ప వారు నా చిన్ననాటి ప్రేమ, నా ప్రాణం అని భావించడం లేదు. అలాగే కొందరు తల్లిదండ్రులు కూడా పిల్లలను కేవలం వృద్ధాప్యంలో తమకు ఆర్థిక ఆసరా కోసమే చూస్తున్నారు తప్ప వారు నా జీవితానంద కారణం అని అనుకోవడం లేదు. ఇది నిజమైన బంధమా? ఖచ్చితంగా కాదు. ఇది కేవలం అవసరం అనే పునాదిపై నిలిచిన ఒక నాజూకు కట్టడం చిన్న కష్టాల గాలి వీచగానే కుప్పకూలిపోయేది. జీవితంలో నిజమైన బంధాన్ని గుర్తించడం చాలా సులభం. మన కష్ట సమయంలో, అందరూ వదిలేసినప్పుడు ఎవరు మనకు తోడుగా దగ్గరుంటారో వారే నిజమైన వారు. మీ సూర్యుడు ఆకాశంలో ప్రకాశిస్తున్నప్పుడు, అంటే మీరు ఉన్నత స్థితిలో ఉండి అందరికీ ఉపయోగపడేటప్పుడు మీ చుట్టూ ఉండేవారు కోకొల్లలు. కానీ కాలం కలిసిరాక జీవితం మిమ్మల్ని నేలకు దించినప్పుడు, ఎదుటివారికి మీరు ఏమీ ఇవ్వగలిగే స్థితిలో లేనప్పుడు, అప్పటికీ మీ చేయి పట్టుకుని పక్కన నిలబడేవారే మీ నిజమైన ఆత్మీయులు.

నిజమైన బంధంలో అవతలి వారిపై అంచనాలు చాలా తక్కువగా ఉంటాయి. నువ్వు సమాజం కోసం ఇలానే చేయాలి, నా కోసం ఇలా మారాలి అని వారు మిమ్మల్ని ఒత్తిడి చేయరు. నువ్వు ఎలా ఉన్నావో, లోపాలతో సహా అలానే నేను నిన్ను ప్రేమిస్తున్నాను అని వారు నిశ్శబ్దంగా అంగీకరిస్తారు. నిజమైన బంధంలో కొన్నిసార్లు మౌనం కూడా అద్భుతంగా మాట్లాడుతుంది. మానసిక వేదనలో ఉన్నప్పుడు ఏమీ చెప్పకుండా కేవలం పక్కన కూర్చోవడమే పెద్ద సాంత్వన ఇస్తుంది. ఆ నిశ్శబ్ద సమయంలో పెద్ద పెద్ద మాటల అవసరం ఏమాత్రం లేదు కేవలం వారి ఆత్మీయ ఉనికి ఉంటే చాలు. మనం కూడా జీవితంలో నిజమైన బంధాలను పెంచుకోవాలని ఆశిస్తే, మొదట మన వ్యక్తిగత మనస్తత్వాన్ని పూర్తిగా మార్చుకోవాలి. బంధాన్ని ఒక లౌకిక పెట్టుబడిగా కాకుండా దేవుడిచ్చిన ఒక అమూల్యమైన వరంగా భావించాలి. ఎదుటివారిపై నిజమైన ఆప్యాయత చూపించడం అలవాటు చేసుకోండి. ఈ రోజు ఎలా ఉన్నావు? అని ఆత్మీయంగా అడగడం చాలా చిన్న పని కావచ్చు, కానీ అవతలి వ్యక్తి మనసుపై దాని ప్రభావం అపారమైనది. ఎవరైనా కష్టంలో ఉన్నారని తెలిస్తే ఎలాంటి సంకోచం లేకుండా ముందు వెళ్ళి మాట్లాడండి. మీ స్వంత అవసరం ఉన్నప్పుడు మాత్రమే ఇతరులను గుర్తు చేసుకోవడం పూర్తిగా మానండి. కేవలం పండగలకు, పుట్టినరోజులకు మాత్రమే మొక్కుబడిగా ఫోన్ చేయడం కాదు జీవిత ప్రయాణంలో మధ్య మధ్యలో కూడా, ఎలాంటి కారణం లేకపోయినా వారిని సరదాగా కలవండి. ఎల్లప్పుడూ తిరిగి ఆశించకుండా ఇచ్చే ఉదార మనసు పెంచుకోండి. అవతలి వారికి మీ విలువైన సమయాన్ని ఇవ్వండి. వారిపై ప్రత్యేక శ్రద్ధని ఇవ్వండి. ధైర్యం చెప్పే మంచి మాటల్ని ఇవ్వండి. ఇవి ప్రపంచంలో ఎంత డబ్బుతోనూ కొనలేని గొప్ప సంపద వీటిని ఇవ్వగలిగే వారే నిజమైన ధనవంతులు. బంధాలలో చిన్న చిన్న పొరపాట్లు జరిగినప్పుడు క్షమించడం నేర్చుకోండి. ఎంతటి నిజమైన బంధాలలో అయినా అభిప్రాయ భేదాలు, ఘర్షణలు రావడం సహజం. కానీ వ్యక్తిగత అహంకారం కంటే ఈ బంధం నాకు చాలా ముఖ్యం అని గట్టిగా నిర్ణయించుకున్నవారే ఆ ఘర్షణలను అధిగమించి ముందుకు సాగుతారు. మన పూర్వీకులు, మహర్షులు ఎప్పుడో చెప్పారు "సర్వే జనాః సుఖినో భవంతు" అంటే ఈ సృష్టిలో అందరూ సుఖంగా ఉండాలి అని అర్థం. ఈ అసలైన సుఖం అనేది కేవలం సంపాదించే డబ్బులో లేదు, సమాజంలో వచ్చే హోదాలో లేదు. అది కేవలం మనం పంచుకునే నిజమైన బంధాల్లో మాత్రమే దాగి ఉంది. ఒక కన్నతల్లి ఆప్యాయతతో కూడిన స్పర్శలో ఉంది. ఒక ఆప్తమిత్రుడు నిజాయితీగా చెప్పిన ఓదార్పు మాటలో ఉంది. జీవితాంతం తోడుగా నిలిచిన ఒక మధుర క్షణంలో ఉంది. కాలక్రమేణా మనుషుల అవసరాలు మారిపోతాయి. ఈ రోజు ఒక అవసరం ఉంటే రేపు మరొక కొత్త అవసరం వస్తుంది. కానీ గుండెల్లో నిలిచే ఆప్యాయత ఎప్పటికీ శాశ్వతం. మిమ్మల్ని నిజంగా ప్రేమించే ఒక్కటంటే ఒక్క మనిషి తోడుగా ఉన్నా, వారు మీ జీవితాన్ని నందనవనంగా మారుస్తారు. అలాంటి నిఖార్సైన బంధాలను వెతికి నిర్మించుకోండి, గౌరవంతో పాటించుకోండి, ప్రాణం ఉన్నంతవరకు పరిరక్షించుకోండి. ఎందుకంటే చివరికి మన జీవిత చరమాంకంలో వెనక్కి తిరిగి చూసుకున్నప్పుడు మనం లౌకికంగా ఎంత సంపాదించాం అని ఈ ప్రపంచం అడగదు, మన హృదయం ఎంతమందిని ప్రేమించింది అని మాత్రమే అడుగుతుంది. మనం ఇతరుల నుండి ఎంత పొందాం అని కాదు, సమాజానికి ఎంత ఇచ్చాం అని అడుగుతుంది. ఆ అంతిమ జీవిత లెక్కలో మనం గెలవాలంటే మనకు ఖచ్చితంగా నిజమైన బంధాలు కావాలి. అందుకే బంధం ఎప్పుడూ అవసరం కోసం కాదు కేవలం నిర్మలమైన ఆప్యాయత కోసం మాత్రమే ఉండాలి. అదే నిజమైన బంధం. అదే అసలైన మానవ జీవన వేదం.



డా .సూర్యదేవర రామకృష్ణ ,
9490754169

# జగనన్న టెక్‌ఫోర్స్ ప్రోగ్రాం

సామాజిక మాధ్యమాల్లో వైసీపీ యాక్టివిటీ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. అధికారంలో ఉన్నప్పుడు, ప్రతిపక్షంలోకి వచ్చాక కూడా సోషల్ మీడియాను గట్టిగానే వాడుతూ ఉంటుంది పార్టీ. అయితే ప్రజల మీద దాని ప్రభావం దృష్ట్యా ఇక నుంచి నెక్స్ట్ లెవల్‌కు తీసుకువెళ్లేలా ప్రణాళికలు సిద్ధం చేస్తోందట అధిష్టానం. జగన్ చేస్తున్న రైతు పరామర్శ యాత్రలు, పీపీపీపై పోరుబాట, పార్టీ పరంగా నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమాలు సోషల్ మీడియా ట్రెండింగ్‌లో ఉంటున్నావాటికి ఇంకా మైలేజ్ రావాల్సి ఉందని, ఆశించిన మేర రాలేదన్న అభిప్రాయం వైసీపీ పెద్దల్లో ఉందట. ఇతర అంశాలు తమ పార్టీ ట్రెండ్స్‌ను బైపాస్ చేస్తున్నాయన్న అభిప్రాయానికి వచ్చినట్టు తెలిసింది. రాజకీయ ప్రత్యర్థులు కావాలనే వేరే అంశాలను స్ట్రీమ్‌లైన్‌లోకి తీసుకువచ్చి తమకు రావాల్సిన మైలేజ్‌ను తగ్గిస్తున్నారన్న క్లారిటీకి వచ్చింది ఫ్యాన్ అధినాయకత్వం. అందుకే ఇక కేవలం సభలు, సమావేశాలతోనే సరిపెట్టకుండా టెక్నాలజీ సపోర్ట్‌తో సరికొత్త గేమ్ ప్లాన్ సిద్ధం చేస్తోంది. దానిపేరే జగనన్న టెక్‌ఫోర్స్ ప్రోగ్రాం. సాధారణ పార్టీ కార్యకర్తలు, పార్టీకి కోర్ సింపతైజర్స్‌గా ఉంటే ఐటీ ప్రొఫెషనల్స్‌ను ఒకే తాటిపైకి తీసుకురావడమే ఈ ప్రోగ్రామ్ ముఖ్య ఉద్దేశం. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, డిజిటల్ నిపుణులను ఈ కార్యక్రమంలోకి ఆహ్వానించి వారి నైపుణ్యాన్ని పార్టీ కోసం వాడుకునేలా పక్కా రోడ్ మ్యాప్ సిద్ధం చేస్తున్నట్టు తెలిసింది. దానిద్వారా సోషల్ మీడియాలో పార్టీ ప్రజెన్స్‌ను పెంచడమే కాకుండా ప్రత్యర్థుల ఆరోపణలను తిప్పికొట్టడం, అదే టైంలో... వైసీపీ ప్రభుత్వ హయాంలో చేసిన మంచి పనుల్ని కూడా జనంలోకి తీసుకువెళ్ళాలన్న బహుళ లక్ష్యాలను నిర్దేశించుకున్నట్టు తెలుస్తోంది. ఒక్క ముక్కలో చెప్పాలంటే వైసీపీని డిజిటల్‌గా మరింత బలోపేతం చేయాటమే జగనన్న టెక్‌ఫోర్స్ లక్ష్యం. దానికి సంబంధించి ఎలాంటి ముందస్తు హడావిడి చేయకూడదని నిర్ణయించుకున్నారట. స్టార్ట్ అయినప్పటికంటే....రిజల్ట్ వచ్చినప్పుడు ప్రోగ్రాం పేరు బయటకు రావాలనే కాన్సెప్ట్‌తో సైలెంట్ మోడ్‌లో ఆపరేషన్ మొదలుపెట్టినట్టు పార్టీ వర్గాలు చెప్పుకుంటున్నాయి. ఫీల్డ్ లెవల్‌లో ప్రతి మండలానికి ఒక టెక్ వాలంటీర్‌ను నియమించి.. గ్రౌండ్ నుంచి కేడర్‌కు డిజిటల్ సపోర్ట్ అందించేలా ప్లాన్ సిద్ధం చేశారు.

# శివన్నగూడలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

## జ్ఞాపకాల పందిరి కింద ఒకటైన పాతతరం




**మర్రిగూడ(క్రైమ్ మిర్రర్):** కాలం ఎంత వేగంగా పరిగెత్తినా, జీవితంలో ఎన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించినా.. బాల్యపు జ్ఞాపకాలు, చదువుకున్న పాఠశాల రోజులు ఎప్పటికీ మరువలేనివని నిరూపిస్తూ, మర్రిగూడ మండలంలోని శివన్నగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో, ఆదివారం 2009-10 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఎంతో ఘనంగా జరిగింది. దాదాపు పదహారేళ్ల తర్వాత సహచర విద్యార్థులు ఒకరినొకరు కలుసుకోవడంతో, పాఠశాల ఆవరణమంతా కోలాహలంగా మారింది. ఉదయం 10 గంటలకే మొదలైన ఈ కార్యక్రమంలో, తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను, పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. తమ జీవితాలకు దిశానిర్దేశం చేసిన ఉపాధ్యాయుల పాదాలకు నమస్కరించి, వారి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా నాటి గురువులు మాట్లాడుతూ.. తాము చదువు చెప్పిన విద్యార్థులు ఈ రోజు సమాజంలో వివిధ రంగాలల్లో, స్థిరపడటం చూడటం ఎంతో గర్వంగా ఉందన్నారు. చదువుకునే రోజుల్లో క్లాస్ రూమ్‌లో కూర్చున్న సీట్లలోనే మళ్లీ కూర్చొని నాటి జ్ఞాపకాలను, చేసిన అల్లరిని అందరూ నెమరువేసుకున్నారు. చాలా కాలం తర్వాత కలుసుకోవడంతో, ఒకరికొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకుంటూ, సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు. మధ్యాహ్నం అందరూ కలిసి సహపంక్తి భోజనాలు చేసిన అనంతరం, సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ఆటపాటలతో సాగిన ఈ సమ్మేళనం, బరువెక్కిన హృదయాలతో ఒకరికొకరు వీడ్కోలు చెప్పుకోవడంతో ముగిసింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గోపాల్, రామకృష్ణ, ఆనంద్ ప్రసాద్, ప్రమోద్, నర్సింహా, శ్రీదేవి, స్వప్న, అన్నపూర్ణతో పాటు, పూర్వ విద్యార్థులు కుక్కల వెంకటేష్, మెండే రమేష్, మంజుల, నాగరాజు, సుధాకర్, శంకర్, మహేందర్, సోని, రజిని, పరమేశ్వరి, రేవతి, సంతు తదితరులు పాల్గొన్నారు.

# సరైన అనుమతులు లేని అక్రమ వెంచర్


### కబంధహస్తాల్లో తమ్మడపల్లి గ్రామకంఠం.

### చరిత్ర వెనుక దాగి ఉన్న సదశివపేట సంపద.



**మర్రిగూడ(క్రైమ్ మిర్రర్):** తమ్మడపల్లిలోని సదాశివపేట చారిత్రక సంపదను మింగేస్తూ, నిబంధనలకు పాతరేస్తూ, రియల్ దందాపై తక్షణమే స్పందించి విచారణ జరపాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.. మండలంలోని, తమ్మడపల్లి గ్రామ పరిధిలో గల సర్వే నంబర్ 80లో వెలిసిన, ఒక నూతన వెంచర్ స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది. ఎలాంటి పూర్తి ముందస్తు అనుమతులు లేకుండా, నిబంధనలను బేఖాతరు చేస్తూ, రియల్ ఎస్టేట్ వ్యాపారులు సాగిస్తున్న అక్రమాలు మితిమీరుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.!? నిబంధనల ప్రకారం వ్యవసాయ భూమిని నాలా కన్వర్షన్ పూర్తి చేసిన తరువాత, డీటీసీపీ కానీ హెచ్ఎండీఏ అనుమతులు పొందిన తర్వాతే పనులు ప్రారంభించాల్సి ఉండగా, ఇక్కడ గుట్టుచప్పుడు కాకుండా జేసీబీలు, ట్రాక్టర్లతో భారీ ఎత్తున తవ్వకాలు జరుపుతూ భూమిని చదును చేస్తున్నారు. అంతకంటే ఘోరమైన విషయం ఏమిటంటే, వందేళ్ల చరిత్ర గల సదాశివపేట గ్రామానికి సాక్ష్యాలుగా నిలిచిన పురాతన రాతి బురుజు, దేవాలయాల స్థలాలను, విలువైన గ్రామకంఠం భూమిని సైతం కలుపుకొని, ఈ వెంచర్ పేరిట కబ్జాకు పాల్పడ్డారని ప్రచారం సాగుతుంది.!? స్థానిక ప్రజలు ఎంతో భక్తిశ్రద్ధలతో కొలిచే బాలమ్మ, మైసమ్మ దేవతల గుడి గర్భాలను సైతం వదలకుండా, లాభాల కక్కుర్తితో వాటి అస్తిత్వాన్ని నాశనం చేసేందుకు, ప్రయత్నిస్తుండటం భక్తులలో తీవ్ర ఆందోళనను ఆగ్రహాన్ని కలిగిస్తోంది. ఈ వెంచర్ సరిహద్దుల్లో ఉన్న పురాతన బురుజు చుట్టూ, కనీసం తిరగడానికి వీల్లేకుండా సిమెంట్ గోడలు నిర్మించి, ఆ చారిత్రక సంపదను ఇరకాటంలో పడేశారు. కేవలం ఇక్కడి చారిత్రక సంపదే కాకుండా, రైతుల సాగునీరు, గ్రామానికి జలవనరులుగా ఉన్న చిన్న చిన్న ఇరిగేషన్ కాలువలను, మట్టితో కప్పివేస్తూ వాటి ఆనవాళ్లు లేకుండా చేసే ప్రయత్నం దారుణంగా జరుగుతోంది. భూగర్భ జలాలకు ఆధారమైన పురాతన బావులను సైతం, మట్టితో పూడ్చేస్తూ ప్రకృతిని నట్టేట ముంచుతున్నారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం గ్రామకంఠం, ప్రభుత్వ భూమి ఉన్న సర్వే నెం 80ని ప్రైవేట్ భూమిగా మార్చి, రికార్డులు తారుమారు చేశారనే బలమైన ఆరోపణలు వస్తున్నాయి.!? తమ తాతముత్తాతలు బతికిన సదాశివపేట ఊరు, ఆ బురుజు, గుళ్లు జేసీబీలతో ధ్వంసమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంపై ఇరిగేషన్ శాఖ, అటవీ శాఖ, రెవెన్యూ అధికారులు తక్షణమే స్పందించి, క్షేత్రస్థాయి పరిశీలన జరపాలని, నిబంధనలు ఉల్లంఘించి కాలువలు పూడ్చుతున్న, చెట్లను నరుకుతున్న వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. జిల్లా కలెక్టర్, హెచ్ఎండీఏ కమిషనర్, విజిలెన్స్ అధికారులు తక్షణమే స్పందించి ఈ అక్రమ వెంచర్ పనులను నిలిపివేయాలని, సర్వే నెం 80పై సమగ్ర విచారణ జరిపి గ్రామకంఠం, బురుజు, దేవాలయాల స్థలాలను కాపాడి, మూసివేసిన రోడ్లను పునరుద్ధరించాలని గ్రామ ప్రజలు, ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. గత కొన్నేండ్లకు ముందు ఈ పాత ఊరు అయిన, సదాశివపేట గుప్త నిధుల తవ్వకాలు జరిగి వార్తల్లో నిలిచింది. వెంచర్ నిర్మాణం అంటూ ప్రస్తుతం గుప్త నిధుల కోసం ఏమైనా చేస్తున్నారా అంటూ.. స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు..!? ఇంత జరుగుతున్నా అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై, అనేక అనుమానాలు ఉత్పన్నం అవుతున్నాయి..!? గ్రామస్తులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తుంది..!?

క్రైమ్ మిర్రర్ తెలుగు వెబ్‌సైట్‌కు
కంటెంట్ రైటర్లు కావలెను
సీనియర్లకు మాత్రమే ప్రాధాన్యం



తెలుగులో న్యూస్, ఇన్వెస్టిగేటివ్ రిపోర్టింగ్, సోషల్ అప్‌డేట్స్ మరియు ఫీచర్ రైటింగ్‌లో ఆసక్తి ఉన్న వారికి మంచి అవకాశం.
క్రైమ్ మిర్రర్ తెలుగు డిజిటల్ మీడియా టీమ్ విస్తరణలో భాగంగా అనుభవజ్ఞులైన కంటెంట్ రైటర్లు (సీనియర్ జర్నలిస్టులు, సబ్ ఎడిటర్లు) అవసరం.
తెలుగు భాషపై పట్టు, వార్తా రచనా నైపుణ్యం ఉండాలి. రాజకీయ, క్రైమ్, సోషల్ ఇష్యూస్, ఫీల్డ్ రిపోర్టింగ్‌పై అనుభవం ఉంటే ప్రాధాన్యం.
న్యూస్ వెబ్‌సైట్, ప్రింట్, డిజిటల్ జర్నలిజంలో కనీసం 1 సంవత్సరాల అనుభవం తప్పనిసరి.
స్వతంత్రంగా వార్తలు సిద్ధం చేయగలగాలి, ఫ్యాక్ట్ చెక్ అవగాహన ఉండాలి.
సీనియర్ కంటెంట్ రైటర్స్, సబ్ ఎడిటర్ (డెస్క్ న్యూస్ ఎడిటింగ్), ఫీల్డ్ రిపోర్టర్, ప్రాంతీయ కవరేజ్ కోసం.
సీనియర్ జర్నలిస్టులు, డెస్క్ అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వబడుతుంది.
ఫ్రీలాన్స్ లేదా పార్ట్‌టైమ్ ఆధారంగా కూడా అవకాశాలు అందుబాటులో ఉన్నాయి.
9393929595

# వైసీపీలో సర్వేల కలకలం!

(మొదటి పేజీ తరువాయి)



గత ఎన్నికల్లో మంగళగిరిలో సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న ఆళ్ల రామకృష్ణారెడ్డిని తప్పించారు జగన్మోహన్ రెడ్డి. ఆయన వెంటనే తన రాజకీయ భవిష్యత్తును వెతుక్కుంటూ కాంగ్రెస్ పార్టీలో చేరారు. అయితే ఆయనను బుజ్జగించి మళ్లీ వైసీపీలోకి తెచ్చారు. 2029 ఎన్నికల్లో టికెట్ ఇస్తామన్న హామీ తోనే రామకృష్ణారెడ్డి వెనక్కి వచ్చినట్లు అప్పట్లో ప్రచారం నడిచింది. కానీ ఇప్పుడు కూడా టికెట్ లేదని తేల్చి చెబుతున్నట్లు సమాచారం. అదే జరిగితే రాజకీయ భవిష్యత్తు కోసం కీలక నిర్ణయం దిశగా ఆల రామకృష్ణారెడ్డి అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది.

**గత ఎన్నికల్లో మార్పులు..**

గత ఎన్నికల్లో దాదాపు రాష్ట్ర వ్యాప్తంగా 100 నియోజకవర్గాల్లో మార్పులు చేర్పులు చేశారు జగన్మోహన్ రెడ్డి. కానీ అవి సత్ఫలితాలు ఇవ్వలేదు. అయితే ఈసారి కూడా అటువంటి మార్పులు చేయాలని జగన్మోహన్ రెడ్డి ఆలోచనలు చేస్తున్నారు. ప్రధానంగా ఆర్థికంగా బలమైన నేతలను రంగంలోకి దించాలని చూస్తున్నారు. అయితే గత రెండు సంవత్సరాలుగా ఇన్చార్జ్ బాధ్యతలు చూస్తున్న నేతలు ఇప్పుడు ఆందోళనతో ఉన్నారు. ప్రతి నియోజకవర్గంలో నేతల పనితీరుపై ఒక సర్వే నడుస్తోంది. మీ నియోజకవర్గంలో టిక్కెట్ ఎవరికీ ఇస్తే బాగుంటుందన్న అభిప్రాయాన్ని తీసుకుంటున్నారు. అలానే ఇప్పుడు ఉన్న ఇన్చార్జిలు మాత్రమే కాదు.. ఎన్నికల ముంగిట పరిస్థితులకు తగ్గట్టు నిర్ణయాలు ఉంటాయని హై కమాండ్ చెబుతున్నట్లు తెలుస్తోంది. దీంతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు ఒక రకమైన ఆందోళన కనిపిస్తోంది. ఆర్థికంగా బలమైన నేతలు కోసం నాయకత్వం ఆరాటపడుతోంది. దీంతో ఉన్న నేతలు సైతం పూర్తిగా డిఫెన్స్ లో పడిపోతున్నారు.

**వ్యతిరేకతతో మార్పు..:** మొన్నటి ఎన్నికల్లో చాలామందిని నేతలను నియోజకవర్గాల్లోను మార్చారు. సొంత నియోజకవర్గంలో వ్యతిరేకత ఉందని చెప్పి పక్క నియోజకవర్గానికి మార్చారు. అటువంటి వారు ఇప్పుడు ఇన్చార్జిలుగా కొనసాగుతున్నారు. మొన్న ఎన్నికల్లో సైతం చాలా మంది అభ్యర్థులు ఎక్కువగా ఖర్చు చేశారు. ఆ ఖర్చులు కూడా రాని పరిస్థితి ఉంది. పైగా ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికలు ముంచుకొస్తున్నాయి. ఇటువంటి సమయంలో తప్పకుండా నియోజకవర్గ ఇన్చార్జి పై ఆర్థిక భారం పడుతుంది. అయితే త్వరలో మార్పులు ఉంటాయని ఈ సర్వేల ద్వారా తెలుస్తోంది. దీంతో స్థానిక సంస్థల ఎన్నికల భారం తమది కాదు అంటూ చాలామంది ఇన్చార్జులు ముందే తేల్చి చెబుతున్నారు. తమకు 2029 ఎన్నికల్లో టికెట్ ఇస్తామంటేనే దృష్టి పెడతామని తేల్చి చెబుతున్నారు. మొత్తానికైతే వైసీపీలో ఈ సర్వేల కలకలం పతాక స్థాయిలో ఉంది.



# నిరసన దీక్ష శిబిరం లో స్పృహ తప్పిన వివోఏ అరుణ..

### మండుటెండ లో సైతం కొనసాగుతున్న పోరాటం

**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** తిరుమలాయపాలెం మండల కేంద్రంలో వివోఏల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఉద్రిక్త వాతావరణంలో కొనసాగుతున్నాయి. మండుటెండను సైతం లెక్కచేయకుండా మూడో రోజు కూడా వివోఏలు దీక్షలను కొనసాగించారు. ఈ సందర్భంగా బచ్చోడు గ్రామానికి చెందిన వివోఏ పోలిశెట్టి అరుణ దీక్షలో పాల్గొంటూ ఒక్కసారిగా స్పృహ తప్పి కుప్పకూలడంతో అక్కడ ఉన్న తోటి వివోఏలు, ప్రజలు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. వెంటనే ఆమెను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ప్రస్తుతం వైద్యులు ఆమె ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షిస్తున్నట్లు సమాచారం. ఉదయం నుంచి ఆహారం నీరు తీసుకోకుండా మండుటెండలో దీక్ష కొనసాగించడంతోనే అరుణ అస్వస్థతకు గురైనట్లు తోటి వివోఏలు తెలిపారు. అరుణ స్పృహ తప్పి పడిపోవడంతో దీక్షా శిబిరం వద్ద కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పలువురు వివోఏలు భావోద్వేగానికి గురై ప్రభుత్వ నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకపోవడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. వివోఏలు చాలా కాలంగా కనీస వేతనం అమలు, ఉద్యోగ భద్రత, పెండింగ్ బకాయిల చెల్లింపు, సంక్షేమ పథకాలు అమలు తదితర డిమాండ్లతో పోరాటం చేస్తున్నామని తెలిపారు. గ్రామీణ స్థాయిలో ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ తమను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. కనీస వేతనం కూడా లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు దీక్షా శిబిరాన్ని వివిధ రాజకీయ పార్టీలు ప్రజా సంఘాల నాయకులు సందర్శించి వివోఏలకు సంఘీభావం ప్రకటించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వివోఏల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని, లేకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. వివోఏ అరుణకు మెరుగైన వైద్య సౌకర్యాలు అందించాలని, దీక్ష చేస్తున్న వారందరి ఆరోగ్య పరిస్థితిపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. మరోవైపు అరుణ ఆరోగ్య పరిస్థితిపై తోటి వివోఏలు ఆందోళన వ్యక్తం చేస్తుండగా, ప్రభుత్వం ఇప్పటికైనా చర్చలకు రావాలని కోరుతున్నారు. మండుటెండలోనూ కుటుంబాలను వదిలి నిరాహార దీక్షలు చేస్తున్న తమ పరిస్థితిని ప్రభుత్వం అర్థం చేసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వివో ఏ పోలిశెట్టి అరుణాను మాజీ సర్పంచ్ ప్రజాసంఘాల ఐక్యవేదిక కన్వీనర్ మందడి ఇజ్రాయిల్ సిపిఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను పరామర్శించి ఆమెకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు

# మంద కృష్ణ మాదిగ కే ఛాన్స్!

(మొదటి పేజీ తరువాయి)

కానీ కేంద్ర పెద్దలు కోరడంతో చంద్రబాబు సమ్మతించినట్లు తెలుస్తోంది. బిజెపిలో ఓ ఇద్దరు పదవి కోసం పోటీ పడుతున్నట్లు ప్రచారం జరుగుతోంది.

**తెలంగాణపై పట్టు కోసం..**

ప్రధానంగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ కు బిజెపి తరఫున అవకాశం దక్కే పరిస్థితి కనిపిస్తోంది. గతసారి బీసీ నేత ఆర్ కృష్ణయ్యకు బిజెపి ద్వారా అవకాశం దక్కింది. ఇప్పుడు అదే అవకాశాన్ని మందకృష్ణ మాదిగ కు ఇవ్వాలని బిజెపి భావిస్తోంది. ఎందుకంటే తెలంగాణలో మాదిగ సామాజిక వర్గం అధికం. ఇప్పటికే ఎస్సీ వర్గీకరణ ద్వారా వారి అభిమానాన్ని పొందింది భారతీయ జనతా పార్టీ. మందకృష్ణ మాదిగ తెలంగాణలో బిజెపికి మద్దతు తెలిపేందుకు కూడా సిద్ధపడ్డారు. ఇటువంటి సమయంలో ఆయనకు రాజ్యసభ పదవి ఇచ్చి.. మాదిగలను తన వైపు తిప్పుకోవాలని భావిస్తోంది బిజెపి.

**ఎస్సీ వర్గీకరణతో దగ్గరై..**

తెలంగాణలో మాదిగ సామాజిక వర్గం అధికం. అందుకే చంద్రబాబు ఎస్సీ వర్గీకరణ చేపట్టాలన్న అంశంతో మాదిగలకు దగ్గరయ్యారు. మాదిగల కూడా తెలుగుదేశం పార్టీకి మద్దతు తెలిపారు. కానీ తెలంగాణలో టిడిపి ఉనికి ప్రశ్నార్థకంగా మారింది. బిజెపి బలం పుంజుకుంది. వచ్చే ఎన్నికల్లో సత్తా చాటాలని చూస్తోంది. అందుకే ఆర్ కృష్ణయ్యకు రాజ్యసభ ఇవ్వడం ద్వారా బీసీ సామాజిక వర్గాలను తమ వైపు తిప్పుకోవాలని భావించింది. మాదిగల ఓట్లు కూడా పదిలం చేసుకునేందుకు ఇప్పుడు కృష్ణ మాదిగ పేరు తెరపైకి తెచ్చింది.

**అన్నామలై సైతం..**

మరోవైపు తమిళనాడుకు చెందిన అన్నామలై పేరు ప్రముఖంగా వినిపించింది ఏపీ నుంచి రాజ్యసభకు. తమిళనాడు ఎన్నికల్లో నేరుగా పోటీ చేయకుండా పార్టీ కోసం పని చేశారు అన్నామలై. అటువంటి నేతకు ఏపీ నుంచి రాజ్యసభకు పంపించి కేంద్ర మంత్రివర్గంలోకి తీసుకోవాలన్నది పెద్దల ఆలోచన. కానీ తమిళనాడు ఎన్నికల్లో బిజెపికి ఆశించిన ఫలితాలు రాలేదు. అందుకే అన్నామలై విషయంలో కేంద్ర పెద్దలు పునరాలోచనలో పడినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో చూస్తుంటే మందకృష్ణ మాదిగ వైపే బిజెపి మొగ్గుచూపే అవకాశం ఉంది. చూడాలి మరి ఏం జరుగుతుందో?

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
6 సోమవారం 25-5-2026

# పదవ తరగతి మిత్రుడి అకాల మరణం

**అండగా నిలిచిన శివన్నగూడ 2000-2001 బ్యాచ్.**

**మర్రిగూడ(క్రైమ్ మిర్రర్):** శివన్నగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2000–2001 ఎస్ఎస్సీ బ్యాచ్, కుదాభక్షిపల్లి పూర్వ విద్యార్థి నాంపల్లి రాజు అకాల మరణం చెందడంతో, ఆయన కుటుంబానికి పాత స్నేహితులు అండగా నిలిచారు. రాజు హఠాన్మరణంతో తీవ్ర దిగ్భ్రాంతికి లోనైన, సహచర మిత్రులంతా ఐక్యమత్యంతో ఒకతాటిపైకి వచ్చి, తమ స్నేహ బంధాన్ని చాటుకున్నారు. ఎన్నో ఏళ్లు గడిచినా తమ మధ్య ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ, కష్టసమయంలో ఉన్న మరణించిన మిత్రుడి కుటుంబానికి 61,501 ఆర్థిక సహాయాన్ని అందించారు. పూర్వ విద్యార్థులంతా రాజు కుటుంబాన్ని పరామర్శించి, తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ నగదును అందజేశారు. స్నేహం అంటే కేవలం సంతోషాలను పంచుకోవడం మాత్రమే కాదని, కష్టకాలంలో ఒకరికొకరు అండగా నిలబడటమేనని నిరూపిస్తూ.. ఈ ఆపత్కాలంలో తమవంతు సహాయం ఆ కుటుంబానికి కొంత ఉపశమనాన్ని, ధైర్యాన్ని ఇస్తుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ విపత్కర పరిస్థితుల్లో


రాజు కుటుంబానికి ఆర్థికంగా, మద్దతుగా నిలిచిన 2000–2001 పదవ తరగతి మిత్రులకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.



## మృతుని కుటుంబానికి బియ్యం పంపిణీ

**నూతనకల్ ( క్రైమ్ మిర్రర్):** మండల పరిధిలోని యడవెల్లి గ్రామానికి చెందిన దాసరోజు శివ కోటయ్య చారి ఇటీవల మరణించారు.మృతుని కుటుంబాన్ని ఆదుకోవాలని తుంగతుర్తి నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు డా. గాదరి కిషోర్ కుమార్ సూచన మేరకుతుంగతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ గాజుల తిరుమల్ రావు నేతృత్వంలో వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేసి, 100 కేజీల బియ్యాన్ని అందజేశారు . ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జటంగి సరిత కృష్ణ, మాజీ సర్పంచ్ కొచ్చర్ల బాబు, గాజుల ఉపేందర్,రైతు సమితి మాజీ కోఆర్డినేటర్ తూముల వెంకటేశ్వర్ రావు,కొరివి సైదులు, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు బొడ్డు వెంకన్న,సీనియర్ నాయకులు నెల్లుట్ల వీరస్వామి(గొల్లపుడి), కంది ప్రసాద్, బయ్య దేవయ్య, బంటు సంతు, బొడ్డు వెంకటేష్, ఏర్పుల రంగయ్య, గాజోని గంగయ్య, జటంగి శ్రీను, బొడ్డు సైదులు, గాజుల సుదర్శన్, గాజుల బాలయ్య ( సైదులు) ఆకిటి యాదగిరి, దుండిగల బిక్షం, మన్యం సైదులు, తలారి వీరయ్య, మల్లెబోయిన ప్రవీణ్, గాజుల విజయ్ కుమార్ ( నరసయ్య), తలారి దుర్గయ్య, జడిగల మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

## షాద్‌నగర్ వెళ్తుండగా ఘోర రోడ్డు ప్రమాదం.. మహిళ మృతి





**గండిపేట్ : ( క్రైమ్ మిర్రర్ ):** శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎన్‌హెచ్-44 రహదారిపై జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ అక్కడికక్కడే మృతి చెందగా, ఆమె భర్త తీవ్రంగా గాయపడ్డాడు.పోలీసుల వివరాల ప్రకారం.. రాజేంద్రనగర్ మండలం కాటేదాన్ మధుబన్ కాలనీకి చెందిన గూడ రాజు తన భార్య గూడ స్వప్నతో కలిసి షాద్‌నగర్‌లో ఉన్న తమ కుమార్తె ఇంటికి బైక్‌పై వెళ్తున్నారు. ఈ క్రమంలో పాలమాకుల గ్రామ పరిధిలోని మారుతి మోడ్రన్ రైస్ మిల్ సమీపంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన ఆర్జే32జీఈ4605 నంబర్ గల లారీ కంటైనర్ బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గూడ స్వప్న రోడ్డుపై పడిపోగా, లారీ టైర్ ఆమె తలపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందింది. గూడ రాజుకు చేతులు, కాళ్లు, ముఖంపై గాయాలు అయ్యాయి. లారీ డ్రైవర్ అజీత్ కుమార్‌ను రాజస్థాన్ రాష్ట్రం జైపూర్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించినట్లు ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ కె. నరేందర్ రెడ్డి తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు శంషాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## లాయర్ మొయిజుద్దీన్ హత్య కేసులో నిందితుల అరెస్ట్

హైదరాబాద్: న్యాయవాది మొయిజుద్దీన్ హత్య కేసులో నిందితుల్ని హైదరాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. గోవాలో నలుగురు నిందితుల్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కబాడిగూడాకు చెందిన వినయ్ అనే వ్యక్తి కారుతో ఢీకొట్టినట్లు గుర్తించారు పోలీసులు. దీనిలో భాగంగా గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు.. ఈ హత్య కేసుకు సంబంధించి వినయ్‌తో సహా నలుగుర్ని అరెస్ట్ చేశారు. కాగా, శనివారం(మే 23వ తేదీ) నగరంలోని మాసబ్‌ట్యాంక్ పరిధిలో దారుణ ఘటన చోటుచేసుకుంది.. ప్రముఖ న్యాయవాది కాజా మొయినుద్దీన్‌ను గుర్తుతెలియని దుండగులు కారుతో ఢీకొట్టి హత్య చేసిన ఘటన సంచలనం రేపుతోంది. శనివారం ఉదయం ఆయన తన నివాసం నుంచి కారులో బయల్దేరుతున్న సమయంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన ధుండగులు కారుతో ఢీ కొట్టి అటాక్ చేశారు. ఈ ప్రమాదంలో మొయినుద్దీన్‌కు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు వెంటనే ఆసుపత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ ఆయన మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. ఘటన తర్వాత నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. దాడికి సంబంధించిన దృశ్యాలు సమీపంలోని సీసీ కెమెరాల్లో నమోదయ్యాయి. దీని ఆదారంగా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# ఈ నెలాఖరులోగా వరి ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలి

**మహిళా సంక్షేమ వారోత్సవాలను విజయవంతం చేయాలి.. జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**



**సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి మే 24:** జిల్లాలో అకాల వర్షాల నేపథ్యంలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆదివారం ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు తదితరులు అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ధాన్యం కొనుగోళ్లు, ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ నెల 25 నుండి 30 వరకు నిర్వహించనున్న మహిళా సంక్షేమ వారోత్సవాలపై సమీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. గోదాముల కొరత, లారీలు, హమాలీల సమస్యలు ఉన్నచోట వెంటనే పరిష్కార చర్యలు చేపట్టాలని సూచించారు. రైతులకు చెల్లింపులు వేగంగా అందేలా ట్యాబ్ ఎంట్రీలు, డేటా అప్‌డేషన్‌ను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని తెలిపారు. ధాన్యం కొనుగోలు విషయంలో రైతులను ఇబ్బంది పెట్టే మధ్యవర్తులు, మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. తాలు, తరుగు పేరుతో రైతులను మోసం చేసే వారిని ఉపేక్షించబోమన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఈ నెల 25 నుండి నిర్వహించనున్న మహిళా సంక్షేమ వారోత్సవాలను నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం సమర్థవంతంగా నిర్వహించి విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ ప్రతీక్ జైన్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ ,జిల్లాలో అకాల వర్షాల వల్ల ధాన్యం తడవకుండా కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన చర్యలు తీసుకోవాలని, వరి, మొక్కజొన్న కొనుగోళ్లను రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. మహిళా సంక్షేమ వారోత్సవాల నిర్వహణలో అన్ని శాఖలు సమన్వయంతో పని చేసి, షెడ్యూల్ మేరకు కార్యక్రమాలను సజావుగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ క్యాంపు కార్యాలయం వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, జిల్లా పౌరసరఫరాల అధికారి బాల సరోజ, సివిల్ సప్లై డీఎం జయశ్రీ, మెప్మా అధికారి రామాచారి, జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, జిల్లా సంక్షేమ అధికారి లలిత కుమారి తదితరులు పాల్గొన్నారు.



## యువజన కాంగ్రెస్ బలోపేతానికి కమిటీల భర్తీ కీలకం

**అసంపూర్తి కమిటీలను త్వరగా పూర్తి చేయాలని నాయకుల సూచన**

**మిర్యాలగూడ క్రైమ్ మిర్రర్, మే 24:** గ్రామ స్థాయి నుంచి శాసనసభ నియోజకవర్గ స్థాయి వరకు అసంపూర్ణంగా ఉన్న కమిటీలను వెంటనే నియమించాలని యువజన కాంగ్రెస్ నాయకులు కోరారు. ఆదివారం జరిగిన సమావేశంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న దుబ్బాక చంద్రిక, నాగార్జున, మేకల ప్రమోద్ రెడ్డి, కొర్ర రామ్ సింగ్ మాట్లాడుతూ యువజన కాంగ్రెస్ కాంగ్రెస్ పార్టీకి వెన్నెముకలాంటిదని అన్నారు. షేక్ అజహరుద్దీన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నాయకులు మాట్లాడుతూ మిర్యాలగూడ నియోజకవర్గంలో యువజన కాంగ్రెస్ బలంగా ఉందని తెలిపారు. గ్రామ స్థాయి నుంచి అసెంబ్లీ స్థాయి వరకు అసంపూర్తిగా ఉన్న కమిటీలను త్వరగా పూర్తి చేయాలని, యువజన కాంగ్రెస్ నాయకులు మరియు కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలని పిలుపునిచ్చారు. అజహరుద్దీన్ మాట్లాడుతూ ఎమ్మెల్యే, పార్టీ పెద్దలు, మండల నాయకులతో చర్చించి అసంపూర్తిగా ఉన్న కమిటీలను త్వరలో భర్తీ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో షేక్ సికిందర్తో పాటు యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు, పట్టణ అధ్యక్షులు, అసెంబ్లీ కమిటీ సభ్యులు, మండల కమిటీ సభ్యులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## మూవీ టవర్‌లో భారీ అగ్ని ప్రమాదం.. ఎగసిపడ్డ మంటలు




**గండిపేట్ :. ( క్రైమ్ మిర్రర్ ):** నార్సింగి సర్కిల్ కోకాపేట్ మూవీ టవర్‌లో భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. భవనం నుంచి ఒక్కసారిగా మంటలు ఎగసిపడటంతో పరిసర ప్రాంతాల్లో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసే పనిలో నిమగ్నమయ్యారు. భవనం పై అంతస్తుల వరకు మంటలు వ్యాపించడంతో అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా శ్రమిస్తున్నారు. భారీగా పొగలు వ్యాపించ డంతో స్థానికులు భయంతో బయటకు పరుగులు తీశారు. భవనంలో ఎవరైనా చిక్కుకుని ఉన్నారా అనే కోణంలో అధికారులు తనిఖీలు నిర్వహిస్తు న్నారు. ప్రాథమిక సమాచారం ప్రకారం షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈ అగ్ని ప్రమాదం జరిగి ఉండొచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. అయితే ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. పోలీసులు, అగ్నిమాపక శాఖ అధికారులు సంఘటన స్థలంలో సహాయక చర్యలు కొనసాగిస్తున్నారు. ప్రమాదంపై మరిన్ని వివరాలు రావాల్సి ఉంది.

# పార్టీ క్యాడర్ అంతా కలిసి పనిచేయాలన్న మల్లు రవి

**ప్రస్తుతం ఎమ్మెల్యే యశస్విని విదేశాల్లో ఉన్నారని వెల్లడి**

**ఇరు వర్గాల మధ్య సమస్యలను పరిష్కరిస్తామన్న రవి**

పాలకుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలో తలెత్తిన అంతర్గత విభేదాల పరిష్కారానికి అధిష్ఠానం రంగంలోకి దిగింది. పార్టీ బలోపేతం కోసం నేతలు, క్యాడర్ అంతా కలిసి పనిచేయాలని ఎంపీ, టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి పిలుపునిచ్చారు. నియోజకవర్గ పరిణామాలపై హైదరాబాద్‌లో స్థానిక నేతలతో భేటీ అయిన ఆయన, అనంతరం మీడియాతో మాట్లాడారు. ఈ వివాదానికి సంబంధించి ఝాన్సీ రెడ్డి క్రమశిక్షణ కమిటీ ఎదుట హాజరయ్యారని, అయితే ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ప్రస్తుతం విదేశాల్లో ఉండటం వల్ల రాలేకపోయారని తెలిపారు. ఎమ్మెల్యే తిరిగొచ్చిన తర్వాత ఇద్దరూ కలిసి మే 30వ తేదీన కమిటీ ముందుకు హాజరుకావాలని సూచించినట్లు మల్లు రవి పేర్కొన్నారు. పాలకుర్తిలో పార్టీకి వ్యతిరేకంగా పనిచేస్తున్నారంటూ స్థానిక నేతలు హరిప్రసాద్, కృష్ణ కిషోర్‌లపై ఎమ్మెల్యే వర్గం ఫిర్యాదు చేయగా.. మరోవైపు ఎమ్మెల్యే, ఝాన్సీ రెడ్డిలు క్యాడర్‌ను పట్టించుకోకుండా వేధిస్తున్నారంటూ కౌంటర్ ఫిర్యాదులు అందాయని ఆయన వివరించారు. ఇప్పటికే కిషోర్, హరిప్రసాద్‌లకు షోకాజ్ నోటీసులు ఇవ్వగా, వారు ఆధారాలతో సమాధానం ఇచ్చారన్నారు. ఈ సమస్యపై జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో పాటు స్థానిక నేతలతో కలిసి చర్చించి, ఇరు వర్గాల మధ్య సమస్యలను పూర్తిగా పరిష్కరిస్తామని మల్లు రవి స్పష్టం చేశారు.

